

## ఈఓఎస్-05 ప్రయోగంపై
# మోదీ ప్రశంసలు

- ఇస్రో చరిత్రాత్మక విజయంపై ప్రధాని అభినందనలు
- జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగం విజయవంతం కావడం గర్వకారణమని వెల్లడి
- భారత అంతరిక్ష సాంకేతిక సామర్థ్యానికి మరో నిదర్శనమన్న మోదీ
- ఈఓఎస్-05ను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన ఇస్రో
- సబ్-జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ఉపగ్రహం
- తెల్లవారుజామున 2.55 గంటలకు షార్ నుంచి ప్రయోగం



## కొండా సురేఖ బర్తరఫ్
# బాధాకరం

- కొండా సురేఖ తొలగింపు నిర్ణయం బాధాకరమన్న టీపీసీసీ చీఫ్
- అయితే పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని స్పష్టీకరణ
- హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవని హెచ్చరిక
- పార్టీలోనే కొనసాగితే సురేఖకు అవకాశాలు ఉంటాయని సూచన
- సీఎం రేవంత్ రెడ్డి ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయరని స్పష్టీకరణ

## కొండా సురేఖ సరే మరి పొంగులేటి సంగతేంటి?

- పొంగులేటిపై హరీశ్‌రావు సెటైర్లు
- 22-ఏ భూములపై ప్రభుత్వం బొంకుతోంది
- కొండా సురేఖపై చర్యలు.. పొంగులేటిపై ఎందుకు కాదు?
- పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టారని ఆరోపణ
- రేవంత్–పొంగులేటి మధ్య ఏం పొత్తు?
- పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలి
- కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్యాలపై బీఆర్ఎస్ నిరసన
- సిర్పూర్‌లో ప్రభుత్వంపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు




TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 77 | హైదరాబాద్ | శనివారం 05-09-2026 | పేజీలు: 08


## కొడంగల్‌కు పరుగులు.. వికారాబాద్‌కు ఎదురుచూపులు!




4

## డేటా, ఏఐ రంగాలదే భవిష్యత్

- డేటా, ఏఐ, కంటెంట్ రంగాల్లో అపార అవకాశాలు
- టెక్నాలజీ ప్రపంచాన్ని రెండు దశాబ్దాలుగా దగ్గరగా చూశా
- ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కంటెంట్ వినియోగం
- డేటా నిల్వ, నిర్వహణలో కాన్‌స్టర్‌దే కీలక పాత్ర
- టైర్-2, టైర్-3 నగరాలపై కాన్‌స్టర్ ఫోకస్ అభినందనీయం



3

## కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి రానివ్వం..

- వెయ్యి రోజులుగా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్
- తీవ్ర అంతర్గత సంక్షోభంలో కాంగ్రెస్ ప్రభుత్వం
- కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుకోవాలి
- కొండా సురేఖ, సుస్మిత వ్యాఖ్యలపై జగదీశ్‌రెడ్డి ఫైర్
- రేవంత్‌రెడ్డిని సీఎం పదవి నుంచి బర్తరఫ్ చేయాలి
- సురేఖ తమకు టచ్‌లో లేరన్న జగదీశ్‌రెడ్డి



3



## సీఎం కావాలనుకుంటున్నా..

- ముఖ్యమంత్రి పదవిపై తన ఆకాంక్షను బహిరంగంగా వెల్లడించిన కవిత
- సీఎం పదవి కేవలం అధికార హోదా కాదని వ్యాఖ్య
- ముఖ్యమంత్రి పదవికి గౌరవం, హుందాతనం ఎంతో ముఖ్యమని వెల్లడి
- రేవంత్‌రెడ్డి పాలనపై కవిత తీవ్ర విమర్శలు
- 'తుగ్లక్ చర్యలు' అనాల్సిన అవసరం లేదంటూ వ్యంగ్యాస్త్రాలు
- 'రేవంత్‌రెడ్డిలా ఉన్నావ్' అంటే చాలని వ్యాఖ్య
- హరీశ్‌రావు భార్యపై పోటీకి సిద్ధమంటూ సవాల్
- గతంలో హరీశ్‌రావుపై పోటీ చేస్తానన్న మాటను గుర్తుచేసిన కవిత
- తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొంటానని స్పష్టీకరణ
- అవసరమైతే హరీశ్‌రావు భార్యను రాజకీయాల్లోకి తీసుకురావాలని వ్యాఖ్య

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాజకీయాల్లో తన రాజకీయ లక్ష్యాలపై కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ముఖ్యమంత్రి కావాలని అనుకుంటున్నానని ఆమె స్పష్టం చేశారు. సీఎం పదవి కేవలం అధికార హోదా కాదని, ఆ పదవికి గౌరవం, హుందాతనం ఎంతో ముఖ్యమని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి పదవిని చేపట్టే వ్యక్తి ఆ హోదాకు తగిన గౌరవాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు.ఇదే సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై కవిత తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ప్రభుత్వ నిర్ణయాలు, పాలన

మిగతా 2 లో..

## మూడు బెర్తులు.. ఆరుగురి
# మధ్య పోటీ

- కొండా సురేఖ ఉద్వాసనతో మంత్రివర్గంలో మరో ఖాళీ
- ఇప్పటికే రెండు పదవులు ఖాళీగా ఉన్న పరిస్థితి
- ఆశావహులుగా పలువురు సీనియర్ ఎమ్మెల్యేల పేర్లు
- సామాజిక సమీకరణాలపై అధిష్ఠానం దృష్టి
- బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రాతినిధ్యంపై కసరత్తు
- రెడ్డి వర్గానికి మరో అవకాశం దక్కేనా?
- రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇస్తారా?
- రాజగోపాల్‌రెడ్డికి ఇచ్చిన హామీ అమలవుతుందా?
- ఎస్టీ కోటాలో ఇద్దరి మధ్య ఆసక్తికర పోటీ
- హోంశాఖతోపాటు శాఖల మార్పుపైనా ఉత్కంఠ



**సిద్దిపేట, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణలో మంత్రివర్గ విస్తరణపై మళ్లీ చర్చ మొదలైంది. ఇప్పటికే రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉండగా.. తాజాగా కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడంతో మరో బెర్తు ఖాళీ అయ్యింది. దీంతో మొత్తం మూడు మంత్రి పదవులను భర్తీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మూడు స్థానాల కోసం కాంగ్రెస్‌లో పలువురు ఆశావహుల పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఆది శ్రీనివాస్, రాములు నాయక్, రాంచంద్ర నాయక్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గడ్డం ప్రసాద్‌కుమార్, మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు మహేశ్‌కుమార్‌గౌడ్ పేరు కూడా

మిగతా 2 లో..

## 9 రోజుల చీకటి.. ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు

- నేపాల్ జలవిద్యుత్ సొరంగంలో చిక్కుకున్న కార్మికుల రక్షణ
- సంజయ్ సహ్, కబీర్ మహర్జన్‌లను సురక్షితంగా బయటకు తీసిన సైన్యం
- 170 మీటర్ల లోతులో తొమ్మిది రోజుల పాటు నిరీక్షణ
- వరదలు, బురదతో పూర్తిగా మూసుకుపోయిన సొరంగం
- గాలిలోని ఖాళీలే ప్రాణాలు నిలబెట్టినట్లు అంచనా
- ఇతరులను కాపాడే క్రమంలో చిక్కుకున్న సంజయ్
- తొమ్మిది రోజులూ హరే కృష్ణ మహామంత్రం జపించిన సంజయ్
- సొరంగంలో నుంచి శబ్దాలు వినిపించడంతో పెరిగిన ఆశలు
- ఇద్దరి రక్షణతో మిగిలిన వారి కుటుంబాల్లో కొత్త ఆశ
- వందలాది మంది కోసం కొనసాగుతున్న సహాయక చర్యలు

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

నేపాల్‌లో ఘోర వరదల తర్వాత తొమ్మిది రోజులుగా సొరంగంలో చిక్కుకున్న ఇద్దరు కార్మికులను సైన్యం సజీవంగా బయటకు తీసింది. త్రిశూలీ నదిపై ఉన్న అప్పర్ త్రిశూలీ 3ఏ జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగంలో చిక్కుకున్న యాంత్రిక ఫోర్‌మన్ సంజయ్ సహ్, మెకానికల్ సూపర్‌వైజర్ కబీర్ మహర్జన్‌లను శుక్రవారం రక్షించారు. సుమారు 170 మీటర్ల లోపల చిక్కుకున్న వీరిద్దరూ తొమ్మిది రోజుల పాటు బయట ప్రపంచంతో సంబంధం లేకుండా గడిపారు. సొరంగం నుంచి శబ్దాలు వినిపించడంతో రక్షణ బృందాలు మరింత వేగంగా సహాయక చర్యలు చేపట్టాయి. చివరకు ఇద్దరినీ ప్రాణాలతో బయటకు

మిగతా 2లో..



## ఇటలీ ప్రధానిగా మెలోనీ అరుదైన రికార్డు

- రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సుదీర్ఘకాలం పదవిలో ఉన్న ప్రధాని
- 1,413 రోజులు నిరంతరాయంగా అధికారంలో కొనసాగిన మెలోనీ
- 2022లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మెలోనీ
- రాజకీయ సంక్షోభాలు లేకుండా కొనసాగుతున్న ప్రభుత్వం
- ఇటలీ రాజకీయ చరిత్రలో అరుదైన ఘనత
- గత 80 ఏళ్లలో ఇటలీ చూసినవి 68 ప్రభుత్వాలు
- ఇటలీ ప్రభుత్వాల సగటు పదవీకాలం 14 నెలలే
- మెలోనీ నాయకత్వంపై ప్రజల నమ్మకానికి నిదర్శనం
- మోదీ స్నేహితురాలైన మెలోనీకి శుభాకాంక్షలు
- భారత్-ఇటలీ సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్ష



**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ అరుదైన రికార్డు నెలకొల్పారు. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం ఇటలీలో సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన నేతగా నిలిచారు. మెలోనీ ప్రభుత్వం 1,413 రోజుల పాటు నిరంతరాయంగా అధికారంలో కొనసాగింది. 2022లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఆమె..

మిగతా 3లో..

## కనీవినీ ఎరుగని రీతిలో
# భద్రాద్రి అభివృద్ధి

- రూ.351 కోట్లతో భద్రాద్రి ఆలయ పునఃనిర్మాణ పనులు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి పొంగులేటి
- పునఃనిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి
- భక్తులు మెచ్చేలా విశాలంగా ఆలయ నిర్మాణం
- అత్యంత సుందరంగా ఆలయాన్ని తీర్చిదిద్దుతామని వెల్లడి
- బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
- గోదావరి తీరంలోని ఆలయాలకు ప్రత్యేక ప్రాధాన్యం



3

## జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగం విజయవంతం

- ఈఓఎస్-05ను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన ఇస్రో
- తెల్లవారుజామున 2.55 గంటలకు షార్ నుంచి నింగిలోకి దూసుకెళ్లిన రాకెట్
- రెండో ప్రయోగ వేదిక నుంచి ప్రయోగించిన జీఎస్ఎల్వీ-ఎఫ్17
- సబ్-జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ఉపగ్రహం
- సుమారు 2,367 కిలోల బరువున్న ఈఓఎస్-05 ఉపగ్రహం
- జియోసింక్రోనస్ కక్ష్య నుంచి పనిచేయనున్న తొలి ఇమేజింగ్ ఉపగ్రహం
- దాదాపు 36 వేల కిలోమీటర్ల ఎత్తు నుంచి నిరంతర పరిశీలన
- వ్యవసాయం, నీటి వనరులు, విపత్తు నిర్వహణకు కీలక సేవలు
- వ్యూహాత్మక సమాచార సేకరణలోనూ ఉపగ్రహం ఉపయోగకరం
- గగన్‌యాన్ సహా మరో ఆరు ప్రయోగాలకు ఇస్రో సిద్ధం



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) మరో కీలక విజయాన్ని నమోదు చేసింది. జీఎస్ఎల్వీఎఫ్17 వాహకనౌక ద్వారా ఈఓఎస్05 అధునాతన భూ పరిశీలన ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ రెండో ప్రయోగ వేదిక నుంచి** రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది.

సుమారు 18 నిమిషాల ప్రయాణం అనంతరం జీఎస్ఎల్వీఎఫ్17.. ఈఓఎస్05 ఉపగ్రహాన్ని నిర్దేశిత సబ్‌జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (సబ్‌జీటీఓ) లోకి కచ్చితంగా ప్రవేశపెట్టింది. ఉపగ్రహం విజయవంతంగా వేరుపడినట్లు ఇస్రో ప్రకటించింది. ఇది జీఎస్ఎల్వీ వాహకనౌకకు 19వ ప్రయోగం.

**2,367 కిలోల ఉపగ్రహం**

ఈఓఎస్05 సుమారు 2,367 కిలోల బరువున్న అధునాతన భూ పరిశీలన ఉపగ్రహం. జియోసింక్రోనస్ కక్ష్య నుంచి పనిచేయనున్న భారత్ తొలి ప్రత్యేక ఇమేజింగ్ ఉపగ్రహంగా ఇది నిలవనుంది. సాధారణంగా తక్కువ ఎత్తులోని కక్ష్యల్లో తిరిగే భూ పరిశీలన ఉపగ్రహాలు ఒక ప్రాంతాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించలేవు. అయితే ఈఓఎస్05ను జియోసింక్రోనస్ కక్ష్యలోకి చేర్చడం వల్ల భారత్ వైపు నిరంతరంగా పరిశీలన కొనసాగించే సామర్థ్యం లభించనుంది. భూమికి దాదాపు 36 వేల కిలోమీటర్ల ఎత్తులో ఉండే తుది కక్ష్యకు ఉపగ్రహాన్ని దశలవారీగా తరలించనున్నారు. ప్రస్తుతం వాహకనౌక

మిగతా 2లో..

# ఈఓఎస్05 ప్రయోగంపై మోదీ ప్రశంసలు

- **ఇస్రో చరిత్రాత్మక విజయంపై ప్రధాని అభినందనలు**
- **జీఎస్ఎల్వీ-ఎఫ్17 ప్రయోగం విజయవంతం కావడం గర్వకారణమని వెల్లడి**
- **భారత అంతరిక్ష సాంకేతిక సామర్థ్యానికి మరో నిదర్శనమన్న మోదీ**
- **ఈఓఎస్-05ను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన ఇస్రో**
- **సబ్-జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ఉపగ్రహం**
- **తెల్లవారుజామున 2.55 గంటలకు షార్ నుంచి ప్రయోగం**
- **శత్రు దేశాల రహస్య సైనిక స్థావరాల గుర్తింపునకు కీలకం**
- **ప్రకృతి విపత్తుల అంచనాలోనూ ఉపగ్రహం సేవలు**
- **ఇస్రో-భారతీయ పరిశ్రమల భాగస్వామ్యాన్ని ప్రశంసించిన ప్రధాని**
- **అంతరిక్ష రంగంలో భారత్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే ప్రయోగం**

**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) మరో చరిత్రాత్మక విజయాన్ని సాధించడంపై ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. జీఎస్ఎల్వీఎఫ్17 మిషన్ విజయవంతం కావడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. భారత అంతరిక్ష రంగంలో సాంకేతిక సామర్థ్యం, ఆవిష్కరణలు, విస్తృత అవకాశాలకు ఈ ప్రయోగం మరో నిదర్శనమని ఎక్స్ వేదికగా ప్రశంసించారు.

జియోసింక్రోనస్ కక్ష్య నుంచి భారత్ ప్రయోగించిన తొలి ఇమేజింగ్ శాటిలైట్ ఈఓఎస్05ను జీఎస్ఎల్వీఎఫ్17 ద్వారా విజయవంతంగా ప్రయోగించడం భారత అంతరిక్ష రంగం సాధిస్తున్న ప్రగతికి ప్రతీకగా నిలిచిందని మోదీ పేర్కొన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులను అభినందించారు.

ఇస్రో, భారతీయ పరిశ్రమల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యం దేశ అంతరిక్ష రంగానికి మరింత బలాన్ని చేకూరుస్తోందని ప్రధాని అన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా అంతరిక్ష రంగంలో భారత సామర్థ్యాలను మరింత విస్తరించడంతో పాటు, భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణలకు మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు.

**తెల్లవారుజామున ప్రయోగం**

శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీఎఫ్17 వాహక నౌక నింగిలోకి దూసుకెళ్లింది. మేఘాలను చీల్చుకుంటూ ప్రయాణించిన వాహక నౌక ఈఓఎస్05 ఉపగ్రహాన్ని నిర్దేశిత సబ్‌జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్( సబ్‌జీటీఓ)లోకి కచ్చితత్వంతో ప్రవేశపెట్టింది.

**రక్షణ, విపత్తుల అంచనాలో కీలకం**

ఈఓఎస్05 అధునాతన ఇమేజింగ్ సామర్థ్యాలతో పనిచేయనుంది. సరిహద్దుల్లో శత్రు దేశాలు తమ సైనిక స్థావరాలను ఎంత రహస్యంగా ఉంచినప్పటికీ వాటిని గుర్తించడంలో ఈ ఉపగ్రహం కీలకంగా ఉపయోగపడనుంది. భూ ఉపరితలంపై జరిగే మార్పులను నిశితంగా పరిశీలించే సామర్థ్యం ఉండటంతో రక్షణ రంగానికి ఇది ఉపయోగకరంగా మారనుంది.

అదేవిధంగా భవిష్యత్తులో ప్రకృతి విపత్తులను ముందుగా గుర్తించడం వాటి తీవ్రతను అంచనా వేయడం వంటి అంశాల్లోనూ ఈఓఎస్05 కీలక సేవలు అందించనుంది. దీంతో రక్షణతో పాటు విపత్తు నిర్వహణ, భౌగోళిక పరిశీలన వంటి రంగాల్లోనూ ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది.ఈ విజయంతో భారత అంతరిక్ష పరిశోధన సామర్థ్యం మరోసారి ప్రపంచానికి వెల్లడైందని, ఇస్రో శాస్త్రవేత్తల కృషికి ఇది నిదర్శనమని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# 9 రోజుల చీకటి.. ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు

మొదటిపేజీ తరువాయి

తీసుకురాగలిగాయి.

**వరదలతో సొరంగంలో చిక్కుకున్న ఇద్దరు**

ఆగస్టు 26న నేపాల్‌లోని త్రిశూలీ నదీ పరివాహక ప్రాంతంలో భారీ వరదలు, మంచు రాళ్లుబురద ప్రవాహం తీవ్ర విధ్వంసం సృష్టించింది. జలవిద్యుత్ ప్రాజెక్టులు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. అప్పర్ త్రిశూలీ3ఏ ప్రాజెక్టు సొరంగంలోకి వరద నీరు, భారీగా బురద, రాళ్లు చేరాయి. దీంతో అక్కడ పనిచేస్తున్న పలువురు కార్మికులు చిక్కుకుపోయారు.

సంజయ్ సహ్ ఆ సమయంలో ప్రాజెక్టు కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. వరద పరిస్థితి ఒక్కసారిగా విషమించడంతో అక్కడున్న కార్మికులను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఇతరులు బయటకు వెళ్లేలా చూడటంలో నిమగ్నమైన సమయంలో ఆయన మాత్రం సొరంగంలో చిక్కుకుపోయారు. సహచరులను బయటకు పంపే బాధ్యత తనపై ఉందని ఆయన రక్షణ సిబ్బందికి తెలిపారు. కబీర్ మహర్జన్ కూడా అదే సొరంగంలో చిక్కుకున్నారు. ఇద్దరూ సుమారు 170 మీటర్ల లోపల ఉన్న ప్రాంతంలో ఉన్నట్లు రక్షణ బృందాలు గుర్తించాయి. తొలుత వారి ఆచూకీపై స్పష్టత లేకపోవడంతో కుటుంబాల్లో ఆందోళన నెలకొంది.

**తొమ్మిది రోజుల పాటు చీకటిలోనే..**

సొరంగం బయట నుంచి పూర్తిగా మూసుకుపోవడంతో లోపల చిక్కుకున్న వారికి ఆహారం, నీరు అందలేదు. అయినప్పటికీ తొమ్మిది రోజుల పాటు వారు ప్రాణాలతో ఉండగలిగారు. సొరంగంలో కొన్ని ప్రాంతాల్లో గాలి నిలిచిన ఖాళీలు ఉండటం వారి ప్రాణాలను నిలబెట్టి ఉండొచ్చని రక్షణ నిపుణులు భావిస్తున్నారు. అయితే వారు తొమ్మిది రోజులు ఎలా జీవించగలిగారనే దానిపై పూర్తి వివరాలు ఇంకా వెల్లడికాలేదు. సంజయ్ మాత్రం ఈ కఠిన పరిస్థితుల్లో తనకు ఆధ్యాత్మిక జపమే ధైర్యాన్నిచ్చిందని చెప్పారు. తాను నిరంతరం 'హరే కృష్ణ మహామంత్రం' జపిస్తూ ఉన్నానని రక్షణ సిబ్బందికి వివరించారు. ప్రాణాలతో బయటపడతానో లేదో తెలియని పరిస్థితిలో ఆ మంత్రం తనకు మానసిక బలాన్ని ఇచ్చిందని చెప్పారు.

**వినిపించిన శబ్దం.. పెరిగిన ఆశ**

రక్షణ చర్యలు కొనసాగుతున్న సమయంలో సొరంగం లోపలి నుంచి శబ్దాలు వినిపించినట్లు రక్షణ సిబ్బంది గుర్తించారు. దీంతో లోపల ఇంకా ఎవరైనా ప్రాణాలతో ఉండే అవకాశం ఉందన్న ఆశలు పెరిగాయి. రక్షణ బృందాలు బురద, రాళ్లను తొలగిస్తూ సొరంగంలోకి ముందుకు సాగాయి. సుమారు 50 నుంచి 60 మీటర్ల మేర అడ్డుగా ఉన్న శిథిలాలను తొలగించిన తర్వాత కీలక పురోగతి కనిపించింది.

చివరకు సంజయ్, కబీర్‌లను గుర్తించారు. శుక్రవారం ఇద్దరినీ సొరంగం నుంచి బయటకు తీసుకొచ్చారు. రక్షణ సమయంలో వారు బురద, బురద నీటితో పూర్తిగా తడిసిపోయి కనిపించారు. బయటకు తీసుకొచ్చిన వెంటనే వైద్య పరీక్షల కోసం వారిని తరలించారు. తాజా నివేదికల ప్రకారం సంజయ్ గాయాలు ప్రాణాపాయ స్థాయిలో లేవు. కబీర్‌కు మాత్రం చేతులు, కాళ్ల కదలికల విషయంలో ఇబ్బందులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇద్దరినీ చికిత్స కోసం ఖాట్మండు తరలిస్తున్నారు.

**కుటుంబాల్లో ఆనందం**

కబీర్ మహర్జన్ భార్య హీరా శోభకు ఆయన బయటకు వచ్చిన వార్త తీవ్ర భావోద్వేగాన్ని కలిగించింది. తొమ్మిది రోజులుగా భర్త తిరిగి వస్తాడన్న ఆశతో ఎదురుచూశామని ఆమె తెలిపారు. ఆ రోజుల్లో తాము తినలేక, నిద్రపోలేక తీవ్ర ఆందోళనకు గురయ్యామని చెప్పారు. ఇప్పుడు ఆయన సజీవంగా బయటకు రావడం తమకు కొత్త జీవితంలా ఉందని పేర్కొన్నారు.

ఈ ఇద్దరి రక్షణ నేపాల్‌లో కొనసాగుతున్న భారీ సహాయక చర్యలకు కొత్త ఆశను తీసుకొచ్చింది. త్రిశూలీ నదీ పరివాహక ప్రాంతంలోని పలు జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో ఇంకా కార్మికుల ఆచూకీ తెలియాల్సి ఉంది. రాయిటర్స్ తాజా నివేదిక ప్రకారం.. ఆరు జలవిద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించిన సొరంగాల్లో కనీసం 900 మంది చిక్కుకుపోయి ఉండొచ్చని అధికారులు, రక్షణ సిబ్బంది అంచనా వేస్తున్నారు.

**కొనసాగుతున్న గాలింపు**

ఇద్దరు కార్మికులు తొమ్మిది రోజుల తర్వాత ప్రాణాలతో బయటపడటం రక్షణ బృందాలకు కీలక విజయంగా మారింది. అదే సమయంలో సొరంగాల్లో చిక్కుకున్న మరికొందరు కూడా ప్రాణాలతో ఉండొచ్చన్న ఆశలు పెరిగాయి. అందుకే సహాయక చర్యలను మరింత ముమ్మరం చేస్తున్నారు. సొరంగాల్లోని బురద, రాళ్లను తొలగిస్తూ లోపలికి వెళ్లేందుకు మార్గం సుగమం చేస్తున్నారు.

భారీ విపత్తు తర్వాత తొమ్మిది రోజుల పాటు చీకటిలో చిక్కుకుని ప్రాణాలతో బయటపడిన సంజయ్, కబీర్‌ల కథ ఇప్పుడు నేపాల్‌లో ఆశకు ప్రతీకగా మారింది. వారి రక్షణతో గల్లంతైన ఇతర కార్మికుల కుటుంబాల్లోనూ కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. రక్షణ చర్యలు పూర్తయ్యే వరకు మరిన్ని ప్రాణాలను కాపాడేందుకు బృందాలు ప్రయత్నిస్తున్నాయి.



# మూడు బెర్తులు.. ఆరుగురి మధ్య పోటీ

మొదటిపేజీ తరువాయి

చర్చలో ఉంది.

**సామాజిక సమీకరణాలే కీలకమా?**

మంత్రివర్గ విస్తరణలో ఈసారి సామాజిక సమీకరణాలు ప్రధాన పాత్ర పోషించే అవకాశం ఉంది. కేవలం సీనియార్టీని ప్రామాణికంగా తీసుకోకుండా.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, రెడ్డి వర్గాలకు ప్రాతినిధ్యం, మహిళలకు అవకాశం, ప్రాంతీయ సమతుల్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకునే అవకాశముంది. మూడు ఖాళీలు ఉన్నందున బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెరొకటి చొప్పున పదవులు ఇవ్వాలనే ఫార్ములా ఉంటుందా? లేక రెడ్డి, బీసీ, ఎస్టీ లేదా రెడ్డి, ఎస్సీ, బీసీ వంటి సమీకరణాన్ని అనుసరిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. కేబినెట్ పదవులకు కులాల వారీ రిజర్వేషన్ లేకపోయినా.. రాజకీయంగా సామాజిక సమతుల్యతను సాధించేందుకు ఆయా వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం పార్టీలకు కీలక అంశంగా ఉంటుంది.

**రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం**

ప్రాంతీయ సమతుల్యత కూడా ఈసారి కీలకంగా మారే అవకాశం ఉంది. రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడంతో.. ఆ జిల్లాకు చెందిన నేతకు అవకాశం కల్పించాలనే ఆలోచన కాంగ్రెస్‌లో ఉంటే మల్‌రెడ్డి రంగారెడ్డి పేరు బలపడే అవకాశం ఉంది.

అదే సమయంలో ఇతర జిల్లాలకు ప్రాతినిధ్యం, ఆయా ప్రాంతాల్లో పార్టీ బలాన్ని పెంచాల్సిన అవసరం వంటి అంశాలు కూడా పరిగణనలోకి రావచ్చు. దీంతో కేవలం సామాజిక సమీకరణాలే కాకుండా.. జిల్లాల వారీ రాజకీయ ప్రాతినిధ్యం కూడా మంత్రి పదవుల ఎంపికలో ప్రభావం చూపే అవకాశముంది.

**రాజగోపాల్‌రెడ్డికి హామీ**

మూడు బెర్తుల్లో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కాంగ్రెస్‌లో చేరే సమయంలో తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చారని ఆయన గతంలో పేర్కొన్నారు. దీంతో ఈసారి ఆ హామీని నిలబెట్టుకుంటారా? అన్న చర్చ జరుగుతోంది.

రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వడం ద్వారా గతంలో ఇచ్చిన హామీని అమలు చేసినట్టవుతుంది. ఆయన సీనియార్టీ, రాజకీయ అనుభవం కూడా అనుకూలంగా మారవచ్చు. అయితే ప్రస్తుతం పార్టీ అవసరాలు, సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం వంటి అంశాలు తుది నిర్ణయంలో కీలకంగా మారే అవకాశం ఉంది.

**రాజగోపాల్‌రెడ్డి.. మల్‌రెడ్డి**

రెడ్డి సామాజిక వర్గం నుంచి ఒకరికి మాత్రమే అవకాశం ఇవ్వాలనే నిర్ణయం తీసుకుంటే.. రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి మధ్య పోటీ ఆసక్తికరంగా మారనుంది.

రాజగోపాల్‌రెడ్డికి సీనియార్టీ, గతంలో ఇచ్చిన హామీ అనుకూల అంశాలుగా కనిపిస్తున్నాయి. మల్‌రెడ్డి రంగారెడ్డికి మాత్రం జిల్లా ప్రాతినిధ్యం ప్రధాన బలంగా మారొచ్చు. పార్టీ అధిష్ఠానం ఏ అంశానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందన్నదే ఈ ఇద్దరిలో ఎవరి పేరు ముందుకు వస్తుందో నిర్ణయించనుంది.

**ఎస్టీ కోటాలో ఎవరికి?**

ఎస్టీ వర్గం నుంచి రాములు నాయక్, రాంచంద్ర నాయక్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మూడు బెర్తుల్లో ఒకదాన్ని ఎస్టీ వర్గానికి కేటాయించాలనే నిర్ణయం జరిగితే.. వీరిద్దరిలో ఒకరికి అవకాశం లభించే పరిస్థితి కనిపిస్తోంది. అయితే ఇప్పటికే మంత్రివర్గంలో ఎస్టీ ప్రాతినిధ్యం ఉన్న నేపథ్యంలో.. మరో ఎస్టీ నేతను ఎంపిక చేయడంలో ప్రాంతీయ సమీకరణాలు, పార్టీకి వారి సేవలు, నియోజకవర్గ బలం వంటి అంశాలు పరిగణనలోకి వచ్చే అవకాశం ఉంది.

**ఆది శ్రీనివాస్.. గడ్డం ప్రసాద్**

మూడో బెర్తు విషయంలో ఆది శ్రీనివాస్, గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్లు కూడా చర్చలో ఉన్నాయి. బీసీ ప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేయాలని పార్టీ భావిస్తే ఆది శ్రీనివాస్‌కు అవకాశం లభించవచ్చు. ఎస్సీ ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలనే నిర్ణయం తీసుకుంటే గడ్డం ప్రసాద్‌కుమార్ పేరు ముందుకు రావచ్చు.

దీంతో ఈ ఇద్దరి మధ్య పోటీని కేవలం వ్యక్తిగత పోటీగా కాకుండా.. బీసీ, ఎస్సీ సామాజిక సమీకరణాల్లో ఒక బెర్తు కోసం జరుగుతున్న పోటీగా చూడాల్సి ఉంటుంది.

**సీఎం ప్రతిపాదన.. అధిష్ఠానం నిర్ణయం**

మంత్రి పదవుల ఎంపికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదన కీలకంగా ఉంటుంది. అయితే తుది నిర్ణయం కాంగ్రెస్ అధిష్ఠానంతో సంప్రదింపుల తర్వాతే వెలువడే అవకాశం ఉంది. దీంతో సీఎం ఎవరిని ప్రతిపాదిస్తారు? అధిష్ఠానం ఎలాంటి ప్రమాణాలను ప్రాతిపదికగా తీసుకుంటుంది? అన్నది చర్చనీయాంశంగా మారింది.

సీఎంకు సన్నిహితంగా ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారా? లేక పార్టీకి దీర్ఘకాలంగా విధేయంగా ఉన్న నేతలను ఎంపిక చేస్తారా? అన్నది కూడా ఆసక్తికరంగా మారింది. పార్టీ రాజకీయ అవసరాలకు అనుగుణంగా సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను కలిపి తుది జాబితాను రూపొందించే అవకాశం ఉంది.

మూడు బెర్తులకు ఆరు పేర్లు

ప్రస్తుతం ప్రధానంగా వినిపిస్తున్న పేర్లను పరిశీలిస్తే.. మూడు బెర్తులకు ఆరుగురి మధ్య పోటీ ఉన్నట్టుగా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రెడ్డి వర్గం నుంచి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్లు.. ఎస్టీ వర్గం నుంచి రాములు నాయక్, రాంచంద్ర నాయక్ పేర్లు.. బీసీ, ఎస్సీ సమీకరణంలో ఆది శ్రీనివాస్, గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి.

ఈ సమీకరణాల్లో ఒక్కో వర్గం నుంచి ఒక్కొక్కరికి అవకాశం ఇస్తే.. సామాజిక, ప్రాంతీయ సమతుల్యత సాధించే అవకాశం ఉంటుంది. అయితే పార్టీ చివరకు ఏ లెక్కను ఎంచుకుంటుందన్నదే అసలు ప్రశ్న.

**విస్తరణేనా.. పునర్వ్యవస్థీకరణా?**

మంత్రివర్గ విస్తరణ అంటే కేవలం ఖాళీగా ఉన్న మూడు పదవులను భర్తీ చేయడమేనా? లేక మొత్తం మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరిస్తారా? అన్నది మరో కీలక అంశం. పునర్వ్యవస్థీకరణ జరిగితే కొత్తగా మంత్రులను చేర్చడంతోపాటు.. ప్రస్తుత మంత్రుల శాఖల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంటుంది.

అలా జరిగితే భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వంటి సీనియర్ మంత్రుల శాఖల్లో మార్పులు చేస్తారా? అన్నది ఆసక్తికరంగా మారుతుంది. సీనియర్ నేతల శాఖలను మార్చడం సాధారణ నిర్ణయం కాకపోవడంతో.. అలాంటి చర్య తీసుకుంటే దాని వెనుక స్పష్టమైన రాజకీయ లేదా పరిపాలనా వ్యూహం ఉండే అవకాశం ఉంది.

**హోంశాఖపై ఉత్కంఠ**

ప్రస్తుతం హోంశాఖ ఖాళీగా ఉండటంతో.. ఆ శాఖను ఎవరికి కేటాయిస్తారన్నది కూడా కీలకంగా మారింది. ముఖ్యమంత్రి తన వద్దే హోంశాఖను కొనసాగిస్తారా? లేక కొత్తగా మంత్రివర్గంలోకి వచ్చే సీనియర్ నేతకు అప్పగిస్తారా? అన్నదానిపై చర్చ జరుగుతోంది.

ముఖ్యమంత్రి తనకు అత్యంత నమ్మకమైన నేతకు హోంశాఖ అప్పగించే అవకాశాన్ని కూడా పూర్తిగా కొట్టిపారేయలేం. అదే సమయంలో సీనియారిటీ, పరిపాలనా అనుభవాన్ని ప్రాతిపదికగా తీసుకుని శాఖను కేటాయించే అవకాశం కూడా ఉంది.

**ఎవరి వైపు మొగ్గు?**

ప్రస్తుత పరిణామాలను బట్టి చూస్తే.. రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి ఇద్దరిలో ఒకరికి రెడ్డి సామాజిక వర్గం ప్రాతినిధ్యం కింద అవకాశం దక్కే అవకాశం ఉందన్న చర్చ ఉంది. అదే విధంగా రాములు నాయక్, రాంచంద్ర నాయక్‌లలో ఒకరికి ఎస్టీ ప్రాతినిధ్యం కింద అవకాశం రావచ్చనే అంచనాలు ఉన్నాయి.

మూడో బెర్తు మాత్రం బీసీ-ఎస్సీ సమీకరణంపై ఆధారపడే అవకాశం కనిపిస్తోంది. ఆది శ్రీనివాస్, గడ్డం ప్రసాద్‌కుమార్‌లలో ఎవరిని ఎంపిక చేస్తారన్నది పార్టీ సామాజిక సమీకరణంపై ఆధారపడి ఉంటుంది. అయితే ఇవన్నీ ప్రస్తుత రాజకీయ పరిణామాల ఆధారంగా వినిపిస్తున్న అంచనాలే. తుది నిర్ణయం ముఖ్యమంత్రి ప్రతిపాదన, కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం, సామాజిక-ప్రాంతీయ సమీకరణాలు, పార్టీ భవిష్యత్ రాజకీయ వ్యూహంపై ఆధారపడి ఉంటుంది. మూడు బెర్తుల భర్తీతో సరిపెడతారా? లేక మంత్రివర్గాన్ని పూర్తిగా పునర్వ్యవస్థీకరించి శాఖల్లోనూ మార్పులు చేస్తారా? అన్నదే ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రధాన చర్చగా మారింది.

# కొండా సురేఖ సరే మరి పొంగులేటి సంగతేంటి?

- **పొంగులేటిపై హరీశ్‌రావు సెటైర్లు**
- **22-ఏ భూములపై ప్రభుత్వం బొంకుతోంది**
- **కొండా సురేఖపై చర్యలు.. పొంగులేటిపై ఎందుకు కాదు?**
- **పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టారని ఆరోపణ**
- **రేవంత్–పొంగులేటి మధ్య ఏం పొత్తు?**
- **పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలి**
- **కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్యాలపై బీఆర్ఎస్ నిరసన**
- **సిర్పూర్‌లో ప్రభుత్వంపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

22A భూముల విషయంలో బొంకుతున్నారని మంత్రి పొంగులేటి మంత్రి పొంగులేటి కాదని ఆయన బొంకులేటి అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలపై ఇవాళ సిర్పూర్ బీఆర్ఎస్ నిరసన కార్యక్రమంలో మాట్లాడిన హరీశ్ రావు.. తనను తిట్టారని కొండా సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్ రెడ్డి.. మరి నిషేధిత భూముల పేరిట ప్రజలను పట్టి పీడిస్తున్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డితో పొంగులేటికి ఏం పొత్తుందో చెప్పాలన్నారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా రేవంత్ రెడ్డి నిషేధించాలని డిమాండ్ చేశారు.

**సీఎంకో న్యాయాం, సామాన్యులకో న్యాయమా?**

సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే.. కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూ రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని, రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22A లోనే ఉందని రేవంత్ ఇల్లు నిషేధిత జాబితాలో పడితే రాత్రికి రాత్రే తీసేసుకున్నాడు.. మరి పేదలకు ఒక న్యాయం, ముఖ్యమంత్రికి ఇంకో న్యాయమా? అని ప్రశ్నించారు. 22A ఒక్క చోట జరిగిన తప్పు కాదని కాగజ్‌నగర్ నియోజకవర్గంలో ఏకంగా 42,867 ఎకరాల రైతుల భూములు 22ఏ జాబితాలో బందీ అయిందన్నారు. నిషేధిత జాబితాలో పెట్టారని నిషేధంలో పెట్టిన పేదల భూములను ప్రభుత్వం వెంటనే రిలీజ్ చేయాలని లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

**కబ్జాల రాజ్యమా?**

రైతులను కబ్జాదారులుగా అవమానించిన ముఖ్యమంత్రి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని భూములు లేవని బ్యాంకు మేనేజర్లు గెంటేస్తున్నారు.. పెళ్లిళ్లు ఆగిపోతున్నాయి.. ఇది ఇందిరమ్మ రాజ్యమా? కబ్జాల రాజ్యమా? అని నిలదీశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, దళితబంధు అన్నీ బంద్ అయ్యాయని ప్రతి అవ్వకు, తాతకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.66 వేల బాకీ పడింది.. వడ్డీతో సహా వసూలు చేస్తామన్నారు.

# జీఎస్ఎల్వీఎఫ్17 ప్రయోగం విజయవంతం

మొదటిపేజీ తరువాయి

ఉపగ్రహాన్ని ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి చేర్చగా, తదుపరి కక్ష్య పెంపు ప్రక్రియల ద్వారా తుది కక్ష్యలోకి ప్రవేశ పెట్టే కార్యక్రమం కొనసాగుతుంది.



**నిరంతర భూ పరిశీలన**

ఈఓఎస్05 నుంచి లభించే చిత్రాలు, సమాచారంతో దేశంలోని వివిధ ప్రాంతాలను నిరంతరం పరిశీలించే అవకాశం ఉంటుంది. వ్యవసాయం, నీటి వనరుల నిర్వహణ, పట్టణ ప్రణాళిక, పర్యావరణ పర్యవేక్షణ, అటవీ, సముద్ర వనరులు, విపత్తు నిర్వహణ వంటి అనేక రంగాలకు ఉపగ్రహ డేటా ఉపయోగపడనుంది. అత్యవసర పరిస్థితుల్లోనూ ఈ ఉపగ్రహం నుంచి లభించే సమాచారానికి ప్రాధాన్యం ఉంటుంది. వరదలు, తుపానులు, ఇతర ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభావిత ప్రాంతాలను వేగంగా గుర్తించడం, పరిస్థితిని అంచనా వేయడం, సహాయక చర్యలకు అవసరమైన సమాచారాన్ని అందించడం వంటి అంశాల్లో ఈఓఎస్05 సేవలు ఉపయోగపడనున్నాయి.

**వ్యూహాత్మకంగా కీలకం**

జియోసింక్రోనస్ కక్ష్య నుంచి నిరంతర పరిశీలన సామర్థ్యం ఉండటంతో ఈఓఎస్05 వ్యూహాత్మకంగా కూడా కీలకమైన ఉపగ్రహంగా మారనుంది. దేశ భద్రతకు అవసరమైన భూ పరిశీలన, వ్యూహాత్మక సమాచార సేకరణలో దీని డేటా ఉపయోగపడనుంది. ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ ఈ మిషన్ విజయాన్ని భారత అంతరిక్ష కార్యక్రమానికి ముఖ్యమైన ఘట్టంగా అభివర్ణించారు.

ఈ ప్రయోగంతో ఇస్రో మరోసారి తన ప్రయోగ సామర్థ్యాన్ని చాటుకుంది. ముఖ్యంగా గత జనవరిలో జరిగిన పీఎస్ఎల్వీసీ62 ప్రయోగం విఫలమైన తర్వాత ఈ విజయవంతమైన మిషన్ ఇస్రోకు ప్రాధాన్యం సంతరించుకుంది.

**ముందున్న మరిన్ని ప్రయోగాలు**

ఈఓఎస్05 విజయంతో ఇస్రోకు మరిన్ని కీలక ప్రయోగాలకు మార్గం సుగమమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో ఆరు ప్రయోగాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ తెలిపారు. వీటిలో నావిగేషన్ ఉపగ్రహం ఎన్వీఎస్03తో పాటు గగన్‌యాన్ కార్యక్రమంలో భాగంగా తొలి మానవ రహిత ప్రయోగం కూడా ఉన్నాయి.

# కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరం

- **కొండా సురేఖ తొలగింపు నిర్ణయం బాధాకరమన్న టీపీసీసీ చీఫ్**
- **అయితే పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని స్పష్టీకరణ**
- **హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవని హెచ్చరిక**
- **పార్టీలోనే కొనసాగితే సురేఖకు అవకాశాలు ఉంటాయని సూచన**
- **సీఎం రేవంత్ రెడ్డి ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయరని స్పష్టీకరణ**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**



తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం బాధ కలిగించేదే అయినా, పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉందని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అధిష్ఠానం ఈ చర్యలు తీసుకుందని వివరించారు.

పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తుచేశారు. వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు.

"కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు" అని ఆయన అన్నారు. అయితే, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తాయని సూచనప్రాయంగా చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.

# సీఎం కావాలనుకుంటున్నా..

మొదటిపేజీ తరువాయి

తీరుపై వ్యంగ్యంగా స్పందించారు. రేవంత్‌రెడ్డి తీసుకునే నిర్ణయాలను ఇకపై 'తుగ్లక్ చర్యలు' అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం కూడా లేదని వ్యాఖ్యానించారు. ఎవరి వ్యవహార శైలినైనా విమర్శించేందుకు 'రేవంత్‌రెడ్డిలా ఉన్నావ్' అంటే చాలని వ్యంగ్యంగా అన్నారు.

కవిత వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తన భవిష్యత్ లక్ష్యాలపై మరోసారి చర్చకు దారి తీశాయి. ముఖ్యమంత్రి పదవిపై తనకు ఉన్న ఆకాంక్షను ఆమె బహిరంగంగా వెల్లడించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. సీఎం పదవికి కేవలం అధికారమే కాకుండా గౌరవం, హుందాతనం కూడా అవసరమని ఆమె పేర్కొనడం ద్వారా ప్రస్తుత పాలనపై తన అభిప్రాయాన్ని కూడా వ్యక్తం చేశారు.

**హరీశ్‌రావు భార్యపై పోటీకి సవాల్**

ఇదిలా ఉండగా, తన రాజకీయ ప్రత్యర్థి హరీశ్‌రావుపైనా కవిత స్పందించారు. గతంలో హరీశ్‌రావుపై పోటీ చేస్తానని తాను చెప్పిన మాట వాస్తవమేనని గుర్తుచేశారు. అయితే ఇప్పుడు హరీశ్‌రావు భార్య తనపై పోటీ చేస్తే స్వాగతిస్తానని స్పష్టం చేశారు.

"దమ్ముంటే హరీశ్‌రావు భార్య తనపై పోటీ చేయాలి" అంటూ సవాల్ విసిరారు. తనపై



ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఎన్నికల్లో ప్రత్యర్థి ఎవరైనా తాను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్న సంకేతాన్ని ఈ వ్యాఖ్యల ద్వారా ఇచ్చారు.

అవసరమని భావిస్తే హరీశ్‌రావు తన రాజకీయాలను పక్కనపెట్టి, తన భార్యను రాజకీయాల్లోకి తీసుకురావచ్చని కవిత వ్యాఖ్యానించారు. తనపై ఎవరో ఒకరు పోటీ చేయడం తప్పదని, అవసరమని భావిస్తే ప్రత్యర్థి కుటుంబం నుంచి కూడా పోటీకి అభ్యర్థిని తీసుకురావచ్చని అన్నారు. కవిత చేసిన ఈ వ్యాఖ్యల్లో ఒకవైపు ముఖ్యమంత్రి పదవిపై తన రాజకీయ ఆకాంక్షను స్పష్టం చేయడం, మరోవైపు హరీశ్‌రావు వర్గానికి సవాల్ విసరడం ప్రధానంగా కనిపించింది. దీంతో తెలంగాణ రాజకీయాల్లో కవిత తదుపరి రాజకీయ అడుగులు, ఆమె లక్ష్యాలపై చర్చకు తెరలేచింది.

## ఇటలీ ప్రధానిగా మెలోనీ అరుదైన రికార్డు

మొదటిపేజీ తరువాయి

రాజకీయ సంక్షోభాలు లేకుండా ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్నారు.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇటలీలో ప్రభుత్వాల సగటు పదవీకాలం కేవలం 14 నెలలుగా ఉంది. గత 80 ఏళ్లలో ఆ దేశం ఏకంగా 68 ప్రభుత్వాలను చూసింది. తరచూ ప్రభుత్వ మార్పులు, రాజకీయ సంక్షోభాలతో సతమతమైన ఇటలీలో మెలోనీ ప్రభుత్వం మాత్రం స్థిరంగా కొనసాగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

మెలోనీ రికార్డు నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మెలోనీ నాయకత్వంపై ఇటలీ ప్రజలు ఉంచిన నమ్మకానికి ఈ ఘనత నిదర్శనమని పేర్కొన్నారు. భారత్‌ఇటలీ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో మెలోనీ స్నేహం కీలక పాత్ర పోషించిందని మోదీ కొనియాడారు.

భారత్‌ఇటలీ భవిష్యత్ సంబంధాల కోసం సన్నిహిత సహకారాన్ని కొనసాగించేందుకు భారత్ ఎదురుచూస్తోందని మోదీ తెలిపారు. మెలోనీ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## కొండా సురేఖను బీఆర్‌ఎస్‌లోకి రానివ్వం..

- **వెయ్యి రోజులుగా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్**
- **తీవ్ర అంతర్గత సంక్షోభంలో కాంగ్రెస్ ప్రభుత్వం**
- **కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుకోవాలి**
- **కొండా సురేఖ, సుస్మిత వ్యాఖ్యలపై జగదీశ్‌రెడ్డి ఫైర్**
- **సీఎం రేవంత్‌పైనే చర్యలు తీసుకోవాలి**
- **రేవంత్‌రెడ్డిని సీఎం పదవి నుంచి బర్తరఫ్ చేయాలి**
- **సురేఖ తమకు టచ్‌లో లేరన్న జగదీశ్‌రెడ్డి**
- **సుస్మిత వ్యాఖ్యల వెనుక అవినీతి అనకొండ!**
- **పొంగులేటి ఇంట్లో ఈడీ రైడ్‌పై ఎందుకు మౌనం?**
- **ఈడీ ఎందుకు స్పష్టమైన ప్రకటన చేయలేదు?**

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులుగా ప్రజలను ద్రోహం, మోసం చేస్తోందని, ఆ పార్టీ తీవ్ర అంతర్గత సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి విమర్శించారు. తెలంగాణలో ప్రస్తుతం గోదావరి, కృష్ణా నదుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, కృష్ణా నదిలో మన నీటి హక్కులను కాపాడుకోవాల్సి ఉందన్నారు. కొండా సురేఖ, కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సీఎం రేవంత్ రెడ్డిపైనే చర్యలు తీసుకోవాలని, అసలు రేవంత్ రెడ్డిని సీఎం పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కొండా సురేఖ తమకు టచ్‌లో లేరని, సుస్మిత వ్యాఖ్యల వెనుక ఉన్న ఒక అవినీతి అనకొండ ఉందని వ్యాఖ్యానించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంట్లో జరిగిన రైడ్‌పై ఈడీ ఎందుకు స్పష్టమైన ప్రకటన చేయలేదని ప్రశ్నించారు.

సీఎం రేవంత్ రెడ్డికి, తెలంగాణ మంత్రులకు ఏపీ సీఎం చంద్రబాబు దీవెనలు ఉన్నాయని, పొంగులేటికి అసలు రాజకీయ ఓనమాలు తెలియవని జగదీష్ రెడ్డి అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా కేసులు వేసింది బీఆర్ఎస్ పార్టీయేనని గుర్తుచేశారు. శాసన సభ ఎథిక్స్ కమిటీకి నిజాయితీ ఉండాలని, అమ్ముడుపోయిన ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలపై ఆ కమిటీ సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇతర పార్టీల నాయకుల చేరికలపై మాట్లాడుతూ.. కొండా సురేఖను బీఆర్ఎస్ పార్టీలోకి రానివ్వబోమని, తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వమని స్పష్టం చేశారు. అలాగే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అప్లికేషన్ పెట్టుకున్నా పార్టీలోకి తీసుకోమని, గతంలో ఎన్నికలకు ముందు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డిలు రావాలనుకున్నా బీఆర్ఎస్ తీసుకోలేదని వెల్లడించారు. రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తే ఆయన డబ్బులకు అమ్ముడుపోయినట్టేనని పేర్కొన్నారు.

పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలలో వారి క్యారెక్టర్ ఆధారంగా ఒకరిద్దరిని తప్ప ఎవరినీ తిరిగి చేర్చుకోమని, ప్రస్తుతం పార్టీ మారిన ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల నాటికి పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరగకపోయినా, రెండు తెలుగు రాష్ట్రాల్లో డీలిమిటేషన్ కచ్చితంగా జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఏపీలో చంద్రబాబుపై తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైందని, డీలిమిటేషన్ జరిగితే ఆ ప్రజా వ్యతిరేకత నుంచి బయటపడవచ్చని చంద్రబాబు భావిస్తున్నారని వ్యాఖ్యానించారు.

## కృష్ణుడి వేషధారణలో అలరించిన అంగన్వాడీ చిన్నారులు

మొయినాబాద్, సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని యెన్కేపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రంలో జరిగిన ఈ వేడుకల్లో బాలలు అద్భుతమైన వేషధారణతో చూడముచ్చటగా కనిపించారు. ఈ సందర్భంగా ఏఎంఎస్ఎల్‌సీ కమిటీ ఉపాధ్యాయురాలు అరుణ రెడ్డి మాట్లాడుతూ... చిన్నారులను తీర్చిదిద్దిన విధానం ఒక తల్లి మమకారాన్ని, ఆమె మహిమ రూపాన్ని కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శిస్తోందని ప్రశంసించారు. చిన్నారి కృష్ణుడి రూపంలో ఉన్న తమ పిల్లలను తిలకించేందుకు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో అంగన్వాడీ కేంద్రానికి విచ్చేశారు. చిన్నారుల సమ్మోహన రూపాలను చూసి తల్లిదండ్రులు పరవశించిపోయారని, వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. కృష్ణాష్టమి వేడుకలతో అంగన్వాడీ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.



## శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామిని దర్శించుకున్న
# యువనేత జంగం రవి

మహబూబ్ నగర్ సెప్టెంబర్ 04 (ప్రజాక్షేత్రం):

శ్రీశైలం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని జంగం రవి భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆశీస్సులు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిగిరి వెంకటేష్ సిరిగిరి మహేందర్ సిరిగిరి పరుశురాం సిరిగిరి శ్రీనివాస్ మరియు తదితరులు పాల్గొన్నారు.



# కనీవినీ ఎరుగని రీతిలో భద్రాద్రి అభివృద్ధి

- **రూ.351 కోట్లతో భద్రాద్రి ఆలయ పునఃనిర్మాణ పనులు**
- **ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి పొంగులేటి**
- **పునఃనిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి**
- **భక్తులు మెచ్చేలా విశాలంగా ఆలయ నిర్మాణం**
- **అత్యంత సుందరంగా ఆలయాన్ని తీర్చిదిద్దుతామని వెల్లడి**
- **బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి**
- **గోదావరి తీరంలోని ఆలయాలకు ప్రత్యేక ప్రాధాన్యం**

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

భద్రాచలం సీతారామచంద్రస్వామివారిని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంలో స్వామివారి ఎదుట ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ పునఃనిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.

భద్రాచలం ఆలయ పునఃనిర్మాణ పనులను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని మంత్రి తెలిపారు. రూ.351 కోట్లతో కొనసాగుతున్న ఈ పనులను భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఆలయ నిర్మాణంలో విశాలతతో పాటు సౌందర్యానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. భక్తులు ఆలయానికి వచ్చినప్పుడు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు మెరుగైన వసతులు పొందేలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

భద్రాద్రి ఆలయాన్ని భక్తులు మెచ్చేలా విశాలంగా, అత్యంత సుందరంగా పునర్నిర్మిస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల అభివృద్ధిని సమగ్రంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాములోరి ఆలయానికి ఉన్న ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.

గోదావరి తీరంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న అన్ని ఆలయాలను పుష్కరాల నాటికి అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు** వెల్లడించారు. ఈ క్రమంలో ఆయా ఆలయాల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ సమగ్ర ప్రణాళికలో భాగంగా భద్రాచలానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. రాములోరి ఆలయంతో పాటు భద్రాచలం పట్టణాన్ని కూడా కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చే భద్రాచలంలో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గోదావరి తీరంలోని ఆలయాలను ఒక సమగ్ర ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడం ద్వారా భక్తులకు మరింత మెరుగైన అనుభవాన్ని అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు. పుష్కరాల నాటికి అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగనున్నట్టు తెలిపారు.

# డేటా, ఏఐ రంగాలదే భవిష్యత్

- **డేటా, ఏఐ, కంటెంట్ రంగాల్లో అపార అవకాశాలు**
- **టెక్నాలజీ ప్రపంచాన్ని రెండు దశాబ్దాలుగా దగ్గరగా చూశా**
- **ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కంటెంట్ వినియోగం**
- **డేటా నిల్వ, నిర్వహణలో కాన్‌స్టర్‌దే కీలక పాత్ర**
- **టైర్-2, టైర్-3 నగరాలపై కాన్‌స్టర్ ఫోకస్ అభినందనీయం**
- **చిన్న పట్టణాల యువతలో అవకాశాలను అందిపుచ్చుకునే తపన**
- **ఉద్యోగాల కోసం యువత హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేదు**
- **కంపెనీలే యువత వద్దకు వెళ్లి అవకాశాలు కల్పించాలి**
- **ప్రపంచ టైమ్‌జోన్లలో పనిచేయడం సవాలుతో కూడుకున్నదే**
- **టెక్నాలజీ రంగంలో యువతకు అద్భుతమైన భవిష్యత్**

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతున్నదని.. ముఖ్యంగా డేటా, డేటా సెంటర్లు, సర్వర్లు, కృత్రిమ మేధస్సు (ఏఐ), కంటెంట్ రంగాల్లో అపారమైన అవకాశాలు ఏర్పడుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఫీనిక్స్ ప్రైమియా భవనంలో కాన్‌స్టర్ సొల్యూషన్స్ కంపెనీ నూతన కార్యాలయాన్ని కేటీఆర్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం సంస్థ సీనియర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు కంపెనీ కార్యకలాపాలు, వ్యాపార విస్తరణ ప్రణాళికలు, భవిష్యత్ లక్ష్యాలను కేటీఆర్‌కు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం, పరిశ్రమ రెండు రంగాల నుంచి రెండు దశాబ్దాలుగా టెక్నాలజీ ప్రపంచాన్ని అత్యంత దగ్గరగా చూశానని.. ఈ రంగాల్లో పనిచేస్తున్న వారికి అద్భుతమైన భవిష్యత్ ఉన్నదని పేర్కొన్నారు. అమెరికాలో విద్యాభ్యాసం చేసి అక్కడ కొంతకాలం ఉద్యోగం చేసిన అనుభవం ఉన్నదని గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ టైమ్‌జోన్లలో పనిచేస్తూ, అనేక దేశాల ఖాతాదారులతో కలిసి పనిచేయడం ఎంతటి సవాలో తనకు తెలుసన్నారు. కాన్‌స్టర్ పేరుపై సరదాగా స్పందించిన కేటీఆర్.. సంస్థ పేరు వెనుక ఉన్న 'కన్వర్జెన్స్ ఆఫ్ స్టోరేజ్' భావన తనకు ఆసక్తికరంగా అనిపించిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా కంటెంట్ వినియోగం, ఉత్పత్తి విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో దానిని నిల్వ చేయడం, నిర్వహించడం, ప్రపంచానికి చేరవేయడంలో కాన్‌స్టర్ వంటి సంస్థలకు కీలక పాత్ర ఉంటుందని చెప్పారు. కాన్‌స్టర్ సొల్యూషన్స్ టైర్2, టైర్3 నగరాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. చిన్న పట్టణాలు, నగరాల నుంచి వచ్చే యువతలో అవకాశాలను అందిపుచ్చుకోవాలనే ఆకలి, పట్టుదల ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రతిభావంతులైన యువతను ఉద్యోగాల కోసం హైదరాబాద్‌కు తీసుకురావడం కంటే, కంపెనీలు వారివద్దకే వెళ్లి అవకాశాలు కల్పించాలని సూచించారు.

**కేటీఆర్‌కు మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ ఆహ్వానం**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ వేదిక నుంచి ఆహ్వానం అందింది. యూరప్‌లో స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటల్, పెట్టుబడుల రంగాలకు సంబంధించిన ప్రముఖ కార్యక్రమం లక్సెంబర్గ్ వెంచర్ డేస్2026లో కీలకోపన్యాసం చేయాలని నిర్వాహకులు కేటీఆర్‌ను ఆహ్వానించారు. లక్సెంబర్గ్‌లో అక్టోబర్ 14, 15 తేదీల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందింది. ఆసియా, యూరప్ దేశాల్లో పెట్టుబడుల విధానాలు ఎలా భిన్నంగా ఉంటాయి? పెట్టుబడిదారుల రిస్క్ తీసుకునే ధోరణి, స్టార్టప్ వ్యవస్థాపకుల అంచనాలు, పెట్టుబడి అవకాశాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం వంటి అంశాలపై ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక సెషన్‌లో కేటీఆర్ మాట్లాడాలని నిర్వాహకులు కోరారు.

## వెలువర్తిలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

వలిగొండ సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):

యాదాద్రి భువనగిరి జిల్లా మండల పరిధిలోని వెల్వర్తి గ్రామంలో యాదవ సంఘం అధ్యక్షులు చెముడాల మల్లేశం యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ చెముడాల అనిత నర్సింగ్ యాదవ్, బొడ్డు వెంకటరమణ రెడ్డి హాజరవ్వగా వారి సమక్షంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో ఉట్లు కొట్టి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం అధ్యక్షులు చెముడాల మల్లేశం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని, అదేవిధంగా గ్రామ ప్రజల సమక్షంలో ఉట్ల కార్యక్రమం కులమతాలకు అతీతంగా సంతోషంగా జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెముడాల చంద్రయ్య, కృష్ణయ్య యాదవ్, మహేందర్, అశోక్ ముత్యాలు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## హామీలు అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టం

- **బీఆర్ఎస్ నేతలు ధారెడ్డి వెంకట్ రెడ్డి, కొంపల్లి అనంతరెడ్డి**

మొయినాబాద్ , సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):

ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, నేడు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ మొయినాబాద్ మండల అధ్యక్షులు ధారెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశానుసారం మొయినాబాద్ మండల కేంద్రంలో గులాబీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ సర్కార్ సక్రమంగా నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ మోసపూరిత పాలనను నమ్మి ఓట్లు వేసిన ప్రజలు, రైతులు నేడు అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వ తీరుపై ప్రజల తరఫున నిలదీస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసే బాధ్యత ప్రభుత్వంపై ఉందని, దానిని సాధించే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున విశ్రమించేది లేదని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది లేదని, ప్రభుత్వంపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## భక్తి పారవశ్యంలో గణేష్ ఆగమన్

- **భక్తిశ్రద్ధలతో గజానన్ గణేష్‌కు ఘన స్వాగతం**
- **ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు**

పెద్దేముల్, సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం)




రాబోయే వినాయక నవరాత్రి ఉత్సవాలకు పెద్దేముల్ మండల కేంద్రంలో భక్తిశ్రద్ధలతో శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయం సమీపంలో గజానన్ గణేష్ ఉత్సవ కమిటీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ ఆగమన్ స్వాగత కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకర్షణీయంగా అలంకరించిన వినాయక విగ్రహాన్ని గ్రామంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చి భక్తిపూర్వకంగా స్వాగతం పలికారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన వినాయక విగ్రహం, డీజే సంగీతంతో సాగిన స్వాగత ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఏడాది గ్రామంలోకి మొట్టమొదటి గణనాథుడికి ఘన స్వాగతం పలుకుతూ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గణపతి నామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి.

**ఆకట్టుకున్న చిన్నారుల సందడి**

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమాలను కూడా నిర్వహించారు. చిన్నారులకు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు చేయించి, ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు ఆటపాటలతో పాటు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. చిన్నారుల ఉత్సాహభరిత ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. రాబోయే వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నిర్వాహకులు కోరారు. యువత ఐకమత్యంతో ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.



## ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా నిబంధనలు పాటించాలి

- **సీఐ నరేందర్ రెడ్డి**

మొయినాబాద్, సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):

వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నిర్వాహకులు పోలీసు నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని చేవెళ్ల సీఐ నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని అట్లాస్ ఫంక్షన్ హాల్ లో గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండపాల వద్ద నాణ్యమైన వైరింగ్, షెడ్లు ఏర్పాటు చేసుకోవాలని, అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి లౌడ్ స్పీకర్లను ఉదయం 6 నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే, కేవలం భక్తి పాటల కోసం ఉపయోగించాలని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో డీజేలు, లౌడ్ స్పీకర్లకు అనుమతి



లేదన్నారు. మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, 24 గంటలూ ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మండపాల పేరుతో బలవంతపు వసూళ్లు, లాటరీలు, మరియు జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని విగ్రహాల నిమజ్జనం సెప్టెంబర్ 25, 2026లోపు పూర్తి కావాలని తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రజలు పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవాల నిర్వహకులు, ప్రజలు పాల్గొన్నారు

## మురళీ మాధవుడిగా మురిసిన కాశిరెడ్డి క్రియాంశ్ రెడ్డి

- చిన్నారుల కృష్ణాష్టమి వేడుకలు.. అలరించిన గోపికల వేషధారణలు



**పెద్దేముల్, సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**

నల్లని వాడు.. అల్లరివాడు.. గోపికాలోలుడు.. యశోదా తనయుడు.. దేవకీ వసుదేవుల కుమారుడు.. యోగీశ్వరుడిగా భక్తుల హృదయాల్లో కొలువైన శ్రీకృష్ణుడి జన్మాష్టమి వేడుకలు పెద్దేముల్ మండల కేంద్రంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో సందడి చేస్తూ భక్తులను ఆకట్టుకున్నారు.వివిధ పాఠశాలలు, కుటుంబాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు కృష్ణుడు, రాధ, గోపికలతో పాటు దశావతారాల వేషధారణలో మెరిశారు.సాంప్రదాయ దుస్తులు, ముత్యాల హారాలు, బంగారు ఆభరణాలు, నెమలిపింఛాలు, ఉంగరాలతో చిన్నారులను అందంగా అలంకరించడంతో వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ ఏర్పడింది. చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు తమ పిల్లలను చూసి మురిసిపోయారు. ఈ సందర్భంగా కాశిరెడ్డి క్రియాంశ్ రెడ్డి శ్రీకృష్ణుడి వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. నల్లని వర్ణం, నెమలిపింఛం, ముత్యాల హారం,సాంప్రదాయ ఆభరణాలతో కృష్ణుడి రూపంలో దర్శనమిస్తూ అందరినీ ఆకట్టుకున్నాడు.చిన్నారి కృష్ణుడి వేషధారణను చూసిన తల్లిదండ్రులు, బంధువులు ఆనందం వ్యక్తం చేశారు.

**కన్నుల పండువగా ఉట్టి కొట్టే కార్యక్రమం**

వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం చిన్నారులు, భక్తుల్లో ఉత్సాహాన్ని నింపింది. కృష్ణుడి బాల్య లీలలను గుర్తు చేసేలా నిర్వహించిన ఈ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. చిన్నారులు కోలాటాలు,నృత్యాలు,పాటలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

**బాల్యంలోనే సంస్కృతి పరిచయం**

భారతీయ పండుగలు,సాంప్రదాయాలు, సంస్కృతిని బాలబాలికలకు చిన్ననాటి నుంచే పరిచయం చేయడం ద్వారా వాటిని భావితరాలకు వారసత్వ సంపదగా అందించవచ్చని విద్యావేత్తలు, పండితులు, సాధుజనులు, భక్త బృందాలు పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు పిల్లల్లో ఆధ్యాత్మికతతో పాటు మన సంస్కృతి,సాంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. వేడుకల సందర్భంగా చిన్నారులకు తల్లిదండ్రులు కుంకుమ, గంధం తిలకాలు దిద్ది ఆశీర్వదించారు.చిన్నారుల కృష్ణలీలలు, గోపికల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది.

## రాములవారి సన్నిధిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- కోటగిరి రామాలయంలో ఆకట్టుకున్న శ్రీ కృష్ణాష్టమి వేడుకలు
- బోధన్ సేవా కుంజ్ భక్త బృందం ఆధ్వర్యంలో వేడుకలు
- శ్రీకృష్ణుడికి 108 రకాల ప్రసాదాలు సమర్పించిన భక్తులు
- ఉట్టి కొట్టిన కోటగిరి సర్పంచ్ బర్ల మధుకర్

**కోటగిరి సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**

కోటగిరి మండల కేంద్రంలోని రామాలయంలో రాములవారి సన్నిధిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను బోధన్ సేవా కుంజ్ భక్త మండలి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా రామాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీకృష్ణుడికి భక్తులు 108 రకాల ప్రసాదాలు సమర్పించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు వేసిన శ్రీకృష్ణుడు గోపికల వేషధారణ భక్తులను ఆకట్టుకుంది. అనంతరం చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాంప్రదాయ బద్ధమైన ఉట్టి కొట్టే కార్యక్రమం లో చిన్నారులు మహిళలు గ్రామ పెద్దలు పాల్గొని కేరింతల నడుమ ఉట్టి కొట్టారు. కోటగిరి సర్పంచ్ బర్ల మధుకర్ సైతం ఉట్టి పగలగొట్టడంతో అందరూ కేరింతలు కొట్టారు. సంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులకు బోధన్ సేవా కుంజ్ భక్త బృందం ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గ్రామ పెద్ద పుల్లెల మోహన్ రావు మాట్లాడుతూ.... గత రెండు సంవత్సరాలుగా కోటగిరి మండల కేంద్రంలోని రామాలయంలో రాముల వారి సన్నిధిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాము ఇస్కాన్ వాళ్లను అడగగానే తమకు సహకరించి వెంటనే ఇక్కడ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించేందుకు ముందుకు వచ్చిన బోధన్ సేవా కుంజ్ భక్త మండలి సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గ్రామ ప్రజలందరూ కలిసి సంతోషంగా జరుపుకోవాలని శ్రీకృష్ణ జన్మాష్టమి అని ప్రతి సంవత్సరం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు రామాలయంలో నిర్వహించబడతాయని అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కోటగిరి సర్పంచ్ బర్ల మధుకర్ మాట్లాడుతూ... కోటగిరి మండల కేంద్రంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించేందుకు ముందుకు వచ్చిన పుల్లెల మోహన్ రావు, బోధన్ సేవా కుంజ్ భక్త మండలి సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కోటగిరి గ్రామ ప్రజలందరికీ శ్రీ కృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపిన ఆయన ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొని శ్రీకృష్ణుని ఆశీర్వాదాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బర్ల మధుకర్,విఠల్ ప్రభు,రవి ప్రభు,రాము ప్రభు,కౌశిక్ ప్రభు ,వైశాలి మాతాజీ,మాధవి మాతాజీ,శాంతి మాతాజీ,విజయ మాతాజీ,సేవా కుంజ్ భక్త బృందం బోధన్, రామాలయ కమిటీ అధ్యక్షుడు డి.చౌదరి,పుల్లెల మోహన్ రావు,ఉదయ్ భాస్కర్,వెంకట రమణ,అశ్విన్ సేట్,వార్డు మెంబర్ గంగాధర్, మహిళలు భవాని,పార్వతి,ధనలక్ష్మి,లక్ష్మి, రమణమ్మ,అన్నపూర్ణమ్మా,శ్రీలక్ష్మి,ప్రసాద్ శర్మ, కోటగిరి గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.





# కొడంగల్‌కు పరుగులు.. వికారాబాద్‌కు ఎదురుచూపులు!

- కొడంగల్‌కు పరుగులు.. వికారాబాద్‌కు ఎదురుచూపులు!
- ముఖ్యమంత్రి సొంత జిల్లా.. జిల్లా కేంద్రం మాత్రం ఎదురుచూపుల్లోనేనా?
- కొడంగల్‌పై ప్రత్యేక దృష్టి.. వికారాబాద్ వైపు సీఎం అడుగులు ఎప్పుడు?
- అభివృద్ధి ఒక్క ప్రాంతానికేనా? జిల్లా కేంద్రానికి సమాన ప్రాధాన్యత ఎప్పుడు?
- రోడ్లు.. రింగ్ రోడ్డు.. ఫ్లైఓవర్లు.. డ్రైనేజీ.. రవాణా.. పెట్టుబడులు — వికారాబాద్ ఎజెండాపై సీఎం దృష్టి ఎప్పుడు?




ఒకే జిల్లా.. ఒకే ప్రభుత్వం.. ఒకే పరిపాలనా వ్యవస్థ.. కానీ అభివృద్ధి చర్చకు వస్తే మాత్రం ప్రాంతాల మధ్య కనిపిస్తున్న వ్యత్యాసాలు ప్రజల్లో అనేక ప్రశ్నలను రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా కొడంగల్ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి కనిపిస్తున్న నేపథ్యంలో, జిల్లా కేంద్రమైన వికారాబాద్ పట్టణం మాత్రం తన మౌలిక వసతుల కోసం ఇంకా ఎదురు చూస్తోందనే భావన బలపడుతోంది. ముఖ్యమంత్రి సొంత జిల్లా అయిన వికారాబాద్ జిల్లా కేంద్రానికి ముఖ్యమంత్రి పర్యటన ఎప్పుడు? జిల్లా కేంద్రం అభివృద్ధిపై ప్రత్యేక రోడ్‌మ్యాప్ ఎప్పుడు? వికారాబాద్ పట్టణానికి అవసరమైన కీలక మౌలిక వసతులపై ప్రభుత్వం ఎప్పుడు స్పష్టమైన నిర్ణయాలు తీసుకుంటుంది? అన్న ప్రశ్నలు ఇప్పుడు ముందుకు వస్తున్నాయి. ఇది కొడంగల్ అభివృద్ధిని వ్యతిరేకించే వాదన కాదు. ఒక ప్రాంతం అభివృద్ధి చెందడం జిల్లాకు నష్టం కాదు. పైగా కొడంగల్‌లో కొత్త పెట్టుబడులు, సంస్థలు, రహదారులు, విద్యా, పారిశ్రామిక, పట్టణ మౌలిక వసతులు ఏర్పడితే దాని ప్రయోజనాలు జిల్లాలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించే అవకాశం ఉంటుంది. అయితే అభివృద్ధి వేగం ఒక ప్రాంతంలో పెరుగుతున్నప్పుడు, అదే జిల్లాలోని పరిపాలనా కేంద్రం కూడా తన స్థాయికి తగ్గ అభివృద్ధిని పొందాలనే ప్రజల ఆకాంక్షను విస్మరించలేం.

**ముఖ్యమంత్రి సొంత జిల్లా..**
**జిల్లా కేంద్రానికి సీఎం రాక ఎప్పుడు?**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన కొడంగల్ నియోజకవర్గంపై ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉండటం సహజం. అక్కడ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం కూడా రాజకీయంగా, పరిపాలనా పరంగా అర్థం చేసుకోగల అంశమే. కానీ ముఖ్యమంత్రి బాధ్యత నియోజకవర్గ సరిహద్దులతో ముగియదు. ఆయనకు మొత్తం రాష్ట్రంపై బాధ్యత ఉంది. అదే సమయంలో ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని జిల్లా కేంద్రం కూడా రాష్ట్ర పాలనలో ఒక ముఖ్యమైన పరిపాలనా కేంద్రం. అందుకే వికారాబాద్ ప్రజల నుంచి వస్తున్న ప్రశ్నను తేలికగా తీసుకోవాల్సిన అవసరం లేదు.

"కొడంగల్‌కు ముఖ్యమంత్రి దృష్టి పడుతున్నప్పుడు.. జిల్లా కేంద్రం వికారాబాద్‌పై ఆ స్థాయి దృష్టి ఎప్పుడు పడుతుంది?"

"కొడంగల్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు వేగం కనిపిస్తున్నప్పుడు.. వికారాబాద్ పట్టణ మౌలిక వసతులకు ప్రత్యేక వేగం ఎప్పుడు వస్తుంది?"

"ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని జిల్లా కేంద్రానికి ముఖ్యమంత్రి పర్యటన ఎప్పుడు?"

ఈ ప్రశ్నలకు రాజకీయ ఆరోపణలతో కాకుండా అభివృద్ధి ప్రణాళికతో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

**కొడంగల్‌కు పరుగులు..**
**వికారాబాద్‌కు ఎదురుచూపులు?**

కొడంగల్ ప్రాంతంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడులు, సంస్థల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే చర్చ కొనసాగుతోంది. పెద్ద ప్రాజెక్టులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, రహదారులు, ఇతర మౌలిక వసతులు ఒక ప్రాంతంలో ఏర్పడటం ఆ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు ఊపునిస్తుంది.

అయితే అదే సమయంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలో పరిస్థితి ఎలా ఉంది? పట్టణ జనాభా పెరుగుతోంది. వాహనాల సంఖ్య పెరుగుతోంది. వ్యాపార కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ పనుల కోసం జిల్లా కేంద్రానికి వస్తున్నారు. విద్య, వైద్యం, వ్యాపారం, పరిపాలన, రైల్వే ప్రయాణం కోసం ప్రతిరోజూ పట్టణంపై ఒత్తిడి పెరుగుతోంది.

ఈ పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా రహదారులు, ట్రాఫిక్ వ్యవస్థ, పార్కింగ్, డ్రైనేజీ, ప్రజా రవాణా, పట్టణ ప్రణాళిక వంటి రంగాలు ఎంతవరకు సిద్ధంగా ఉన్నాయి? అన్నది సమీక్షించాల్సిన అంశం.

జిల్లా కేంద్రం అంటే కేవలం ప్రభుత్వ కార్యాలయాల సమూహం కాదు

జిల్లా కేంద్రం అనేది కేవలం కలెక్టరేట్, జిల్లా స్థాయి కార్యాలయాలు ఉన్న ప్రదేశం మాత్రమే కాదు. అది మొత్తం జిల్లాకు పరిపాలనా, ఆర్థిక, విద్యా, వైద్య, వాణిజ్య, రవాణా కేంద్రంగా పని చేస్తుంది.

జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు జిల్లా కేంద్రానికి చేరుకునే మార్గాలు సులభంగా ఉండాలి. పట్టణంలోకి వచ్చిన తర్వాత ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రవాణా వ్యవస్థ ఉండాలి. పాదచారులకు ఫుట్‌పాత్‌లు ఉండాలి. వాహనాలకు పార్కింగ్ సదుపాయాలు ఉండాలి. వర్షపు నీరు, మురుగునీరు సక్రమంగా వెళ్లే డ్రైనేజీ వ్యవస్థ ఉండాలి. పట్టణ విస్తరణకు అనుగుణంగా రోడ్ల ప్రణాళిక ఉండాలి.

ఇవన్నీ లేకుండా ఒక జిల్లా కేంద్రాన్ని భవిష్యత్ అవసరాలకు సిద్ధం చేయడం సాధ్యం కాదు.

**రోడ్లు.. వికారాబాద్ అభివృద్ధికి తొలి పరీక్ష**

వికారాబాద్ పట్టణ అభివృద్ధిలో రహదారులు అత్యంత కీలకం. ప్రధాన రహదారుల నాణ్యతతో పాటు పట్టణంలోని అంతర్గత రోడ్లు, కూడళ్ల నిర్వహణ, డ్రైనేజీ, పాదచారుల మార్గాలు, వీధి దీపాలు, పార్కింగ్ వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలి.

రోడ్డు నిర్మాణం అంటే కేవలం తారు వేయడం కాదు. రహదారి కింద సరైన పునాది, వర్షపు నీటి పారుదల, రహదారి వెడల్పు, భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలు, పాదచారుల భద్రత వంటి అంశాలు కూడా అంతే ముఖ్యం.

ఒకసారి రోడ్డు నిర్మించిన తర్వాత కొద్ది కాలానికే మళ్లీ తవ్వే పరిస్థితి రాకుండా ముందుగానే నీటి పైపులు, డ్రైనేజీ, విద్యుత్, ఇతర మౌలిక వసతుల సమన్వయం ఉండాలి.

**ఫ్లైఓవర్ కావాలా? ముందుగా శాస్త్రీయ అధ్యయనం చేయాలి**

వికారాబాద్‌లో ట్రాఫిక్ సమస్య పెరుగుతున్న నేపథ్యంలో ఫ్లైఓవర్ అవసరంపై చర్చ జరగడం సహజమే. కానీ ఫ్లైఓవర్ ఒక్కటే ప్రతి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం కాదు.

ఎక్కడ వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది? రోజులో ఏ సమయాల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది? భారీ వాహనాల ప్రవాహం ఎంత? రాబోయే పదేళ్లలో వాహనాల సంఖ్య ఎంత పెరిగే అవకాశం ఉంది? రహదారి విస్తరణకు అవకాశం ఉందా? బైపాస్ నిర్మిస్తే సమస్య తగ్గుతుందా? గ్రేడ్ సెపరేటర్ అవసరమా? సిగ్నల్ వ్యవస్థను ఆధునీకరించగలమా?

ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు ట్రాఫిక్ ఇంజినీరింగ్ అధ్యయనం ద్వారా రావాలి.

వికారాబాద్‌కు ఏ పరిష్కారం అవసరమో శాస్త్రీయంగా నిర్ణయించాలి.

**రింగ్ రోడ్డు.. ఇప్పుడే**
**ఆలోచించకపోతే రేపు ఆలస్యం**

వికారాబాద్ భవిష్యత్ పట్టణ విస్తరణను దృష్టిలో పెట్టుకుని రింగ్ రోడ్డు లేదా బైపాస్ అంశంపై సమగ్ర అధ్యయనం అవసరం.

పట్టణం మధ్యలోకి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గం ఉంటే పట్టణ ట్రాఫిక్‌పై ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది.

అయితే రింగ్ రోడ్డు అంటే కేవలం ఒక రహదారి నిర్మించడం కాదు. భూసేకరణ, ఆర్థిక వ్యయం, భవిష్యత్ పట్టణ విస్తరణ, పారిశ్రామిక ప్రాంతాలు, వాణిజ్య కేంద్రాలు, పర్యావరణ అంశాలు, రవాణా అవసరాలను సమగ్రంగా పరిశీలించాలి.

రేపటి వికారాబాద్‌ను దృష్టిలో పెట్టుకుని నేటి నుంచే రహదారి ప్రణాళిక సిద్ధం చేయాలి.

**రైల్వే ఉంది.. దాని ప్రయోజనం ఎంత?**

వికారాబాద్‌కు ఉన్న రైల్వే కనెక్టివిటీ పట్టణానికి ఒక ముఖ్యమైన బలం. రైల్వే ద్వారా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు ప్రయాణ సౌకర్యం ఉంది. కానీ రైల్వే స్టేషన్ చుట్టూ పట్టణ రవాణా వ్యవస్థ ఎలా ఉంది? స్టేషన్‌కు వెళ్లే రోడ్లు ఎలా ఉన్నాయి? పార్కింగ్ సౌకర్యం సరిపోతుందా? స్థానిక ప్రజా రవాణా అందుబాటులో ఉందా?

రైల్వే స్టేషన్‌ను పట్టణ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానించగలిగితే పర్యాటకం, వ్యాపారం, విద్య, వైద్యం వంటి రంగాలకు కూడా ప్రయోజనం కలిగే అవకాశం ఉంది.

**పర్యాటకానికి కేంద్రంగా మారే సామర్థ్యం**

వికారాబాద్ జిల్లాకు సహజసిద్ధమైన పర్యాటక వనరులు ఉన్నాయి. అనంతగిరి కొండలు వంటి ప్రాంతాలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపును ఇస్తున్నాయి. కానీ పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కేవలం ఒక ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దడమే కాదు. అక్కడికి వెళ్లే రహదారులు, పార్కింగ్, పరిశుభ్రత, తాగునీరు, భద్రత, స్థానిక ఉపాధి, హోటళ్లు, రవాణా, ప్రచారం వంటి అంశాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలి.

వికారాబాద్ జిల్లా కేంద్రాన్ని పర్యాటక ప్రవేశ ద్వారంగా అభివృద్ధి చేస్తే పట్టణ వాణిజ్యానికి కూడా ఊతం లభించే అవకాశం ఉంది.

**రాష్ట్రస్థాయి కార్యక్రమాలు..**
**జిల్లా కేంద్రం ఎందుకు వెనుక?**

పెద్ద ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించేందుకు అవసరమైన మౌలిక వసతులు ఏ ప్రాంతంలో అందుబాటులో ఉంటే అక్కడ కార్యక్రమాలు నిర్వహించడం పరిపాలనా అవసరాలపై ఆధారపడి ఉంటుంది. అయితే జిల్లా కేంద్రంలోనే పెద్ద సమావేశాలు, సదస్సులు, ప్రజా కార్యక్రమాలు నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఎందుకు అభివృద్ధి చేయకూడదు? విశాలమైన సమావేశ ప్రాంగణం, పార్కింగ్, మెరుగైన రోడ్లు, ప్రజా రవాణా, భద్రతా ఏర్పాట్లు ఉంటే జిల్లా కేంద్రం రాష్ట్రస్థాయి కార్యక్రమాలకు కూడా వేదికగా మారగలదు.

ఇది కేవలం ప్రతిష్ఠ కోసం కాదు. జిల్లా కేంద్రానికి ఆర్థిక చైతన్యం తీసుకురావడానికి కూడా ఇది ఒక మార్గం.

**పెట్టుబడులు..**
**వికారాబాద్‌కు ఎందుకు రావద్దు?**

కొడంగల్‌లో పెట్టుబడులు రావడం స్వాగతించాల్సిన విషయం. కానీ జిల్లాలోని ఇతర ప్రాంతాలకు కూడా పెట్టుబడులను ఆకర్షించే విధానాలు ఉండాలి.

వికారాబాద్ పట్టణం చుట్టూ చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అనువైన ప్రాంతాలను గుర్తించడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, యువతకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవచ్చు.

జిల్లా కేంద్రంలో ఉపాధి అవకాశాలు పెరిగితే స్థానిక యువతకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది.

**అభివృద్ధి అంటే కేవలం పెద్ద ప్రాజెక్టులు కాదు**

అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు పెద్ద భవనాలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే గుర్తుకు రావాల్సిన అవసరం లేదు.

**సక్రమమైన డ్రైనేజీ కూడా అభివృద్ధే.**

నాణ్యమైన రహదారి కూడా అభివృద్ధే.

పాదచారికి సురక్షితమైన ఫుట్‌పాత్ కూడా అభివృద్ధే.

పార్కింగ్ సమస్యకు పరిష్కారం కూడా అభివృద్ధే.

ప్రజలకు సమయానికి అందే ప్రజా రవాణా కూడా అభివృద్ధే.

పరిశుభ్రమైన పట్టణం కూడా అభివృద్ధే.

యువతకు ఉద్యోగం కూడా అభివృద్ధే.

ఈ ప్రాథమిక అంశాలన్నింటినీ కలిపి చూడగలిగినప్పుడే వికారాబాద్ నిజమైన పట్టణ అభివృద్ధి దిశగా అడుగులు వేయగలదు.

**ప్రజలు అడిగేది పోటీ కాదు.. సమాన దృష్టి**

వికారాబాద్ ప్రజలు కొడంగల్‌ను వెనక్కి లాగాలని కోరుకోవడం లేదు.

వారి ప్రశ్న కూడా అంతే స్పష్టంగా ఉంది—

కొడంగల్ ఎదగాలి.. కానీ వికారాబాద్ ఎందుకు వెనుకబడాలి?

కొడంగల్‌కు పెట్టుబడులు రావాలి.. వికారాబాద్‌కు ఎందుకు రావద్దు?

కొడంగల్‌లో రోడ్లు అభివృద్ధి చెందాలి.. వికారాబాద్ రోడ్లు ఎందుకు మెరుగుపడకూడదు?

కొడంగల్‌లో పెద్ద కార్యక్రమాలు జరగాలి.. జిల్లా కేంద్రం వికారాబాద్ కూడా అలాంటి కార్యక్రమాలకు సిద్ధంగా ఎందుకు ఉండకూడదు?

ముఖ్యమంత్రి వికారాబాద్‌కు వస్తే.. మాటలు కాదు, రోడ్‌మ్యాప్ కావాలి

ముఖ్యమంత్రి వికారాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించే రోజు వస్తే, అది కేవలం సభ నిర్వహించి వెళ్లిపోయే పర్యటన కాకూడదని ప్రజలు కోరుకుంటున్నారు.

వికారాబాద్ పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం నిర్వహించాలి. అధికారులతో సమీక్ష చేయాలి. పట్టణ అవసరాలను నిపుణులతో అధ్యయనం చేయించాలి. ప్రాధాన్యతా క్రమాన్ని నిర్ణయించాలి.

రింగ్ రోడ్డు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం.

**ట్రాఫిక్ సమస్యపై సమగ్ర నివేదిక.**

ఫ్లైఓవర్ లేదా ప్రత్యామ్నాయ పరిష్కారాలపై నిర్ణయం.

ప్రధాన రహదారుల అభివృద్ధికి కార్యాచరణ.

డ్రైనేజీకి శాశ్వత ప్రణాళిక.

రైల్వే అనుసంధానానికి ప్రత్యేక చర్యలు.

పర్యాటక అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్.

పెట్టుబడులు, ఉపాధి కోసం ప్రత్యేక కార్యాచరణ.

ఇలాంటి స్పష్టమైన అంశాలతో కూడిన రోడ్‌మ్యాప్ ప్రకటిస్తే ముఖ్యమంత్రి పర్యటనకు శాశ్వత ప్రయోజనం ఉంటుంది.

**ప్రశ్న ఇప్పుడు ఒక్కటే..**

వికారాబాద్ ప్రజల ముందున్న ప్రశ్న ఒక్కటే.

"కొడంగల్‌కు పరుగులు.. వికారాబాద్‌కు ఎదురుచూపులు ఎందుకు?"

ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని జిల్లా కేంద్రం అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఎప్పుడు?

వికారాబాద్ పట్టణానికి ముఖ్యమంత్రి పర్యటన ఎప్పుడు?

జిల్లా కేంద్రం భవిష్యత్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక ఎప్పుడు?

రింగ్ రోడ్డు, ఫ్లైఓవర్లు, రహదారులు, డ్రైనేజీ, రైల్వే అనుసంధానం, పర్యాటకం, పెట్టుబడులు, ఉపాధి వంటి అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ఎప్పుడు?

ఈ ప్రశ్నలకు సమాధానం రాజకీయ విమర్శలతో కాదు.. పనులతో రావాలి.

చివరికి లక్ష్యం ఒక్కటే..

కొడంగల్ అభివృద్ధి చెందాలి.

వికారాబాద్ అభివృద్ధి చెందాలి.

తాండూరుకు మరింత మౌలిక వసతులు రావాలి.

పరిగికి అభివృద్ధి అవకాశాలు పెరగాలి.

జిల్లాలోని ప్రతి మండలం ముందుకు సాగాలి.

ప్రతి గ్రామానికి నాణ్యమైన రహదారి, మౌలిక వసతులు అందాలి.

ఒక ప్రాంతం ఎదగడం మరో ప్రాంతానికి ముప్పు కాదు. కానీ ఒక ప్రాంతం వేగంగా ఎదుగుతున్నప్పుడు మిగిలిన ప్రాంతాలు కూడా తమ సామర్థ్యానికి తగ్గట్టుగా ఎదగడానికి ప్రభుత్వ విధానం తోడ్పడాలి.

కొడంగల్‌కు పరుగులు పెట్టే అభివృద్ధి వేగం.. వికారాబాద్‌కు కూడా రావాలి.

జిల్లా కేంద్రం ఎదురుచూసే స్థితి నుంచి.. అభివృద్ధికి కేంద్రబిందువుగా మారాలి.

ముఖ్యమంత్రి రాక కోసం ఎదురుచూపులు ఎప్పటివరకు?

కొడంగల్‌కు పరుగులు.. వికారాబాద్‌కు ఎదురుచూపులు!

సొంత జిల్లా.. జిల్లా కేంద్రం.. మరి ప్రత్యేక దృష్టి ఎప్పుడు?

ప్రశ్న ప్రజలది.. సమాధానం ప్రభుత్వానిది!



ఏం రవీందర్
సీనియర్ జర్నలిస్ట్
7901503777

## కల్లూరులో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**పోతంగల్, సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**

పోతంగల్ మండలం లోని కల్లూరు గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శ్రీరామ గణేష్ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి ని పురస్కరించుకుని గ్రామంలో భక్తిశ్రద్ధ, ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లివిరిశాయి.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారి కృష్ణులు, రాధల ముద్దులొలికే అభినయాలు గ్రామస్థులను అలరించాయి. అనంతరం నిర్వహించిన సాంప్రదాయ ఉట్టి కొట్టే కార్యక్రమం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువకులు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొని ఉట్టిని కొట్టడానికి పోటీపడటంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో శ్రీరామ గణేష్ మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను దిగ్విజయం చేశారు.





## బాలకృష్ణుల సందడితో తాండూర్‌లో శ్రీకృష్ణాష్టమి శోభ

- **సాయి మేధ, ఆపిల్ కిడ్స్ పాఠశాలల్లో ఘనంగా ఉట్టికొట్టే వేడుకలు**

**తాండూర్, సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**

శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని తాండూర్ పట్టణంలోని శ్రీ సాయి మేధ విద్యాలయం, ఆపిల్ కిడ్స్ స్కూల్లో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై సందడి చేయడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో కోలాటాలు, నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. దశావతారాల వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారుల చక్కటి ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాలలో నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. శ్రీకృష్ణుడి వేషధారణలో ఉన్న చిన్నారులు పోటీపడి పైకి ఎగురుతూ పెరుగు ఉట్టిని పగులగొట్టేందుకు ప్రయత్నించారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పెరుమాళ్ల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చిన్నారులకు చిన్న వయస్సు నుంచే పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను పఠిస్తూ భారతీయ విలువలను అలవర్చుకోవాలని సూచించారు. ఆంగ్ల మాధ్యమంలో, విద్యనభ్యసిస్తున్నప్పటికీ మన సంస్కృతి, సంప్రదాయాలను మరచిపోకూడదని అన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని పండుగలను పాఠశాలల్లో నిర్వహిస్తూ విద్యార్థుల్లో ఐక్యతా భావాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఎవ్వరిని ఇబ్బంది పెట్టోద్దు

- **- గ్రామాలలో ఉన్న ప్రతి ఒక్క గణేష్ కమిటీ మేము ఇచ్చే ఇన్స్ట్రక్షన్స్ ఫాలో కావాలి**
- **ప్రతి ఒక్కరూ సొసైటీ లక్ష్యాన్ని చేరుకోవాలి**

**చేవెళ్ల సెప్టెంబర్ 4(ప్రజాక్షేత్రం):**

చేవెళ్ల గ్రామాలలోని చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని గణేష్ కమిటీ నిర్వాహకులు అందరికీ చేవెళ్ల సిఐ నరేందర్ రెడ్డి కట్ట సూచనలు ఇచ్చారు. ఇలాంటి అవాంఛనీయ కార్యక్రమాలకు తావు లేకుండా వినాయక చవితి సంబంధించిన జాగ్రత్తలు మరియు భద్రత ఎలా ఉండాలని దాని గురించి వాతావరణం లో నివసిస్తున్న మనందరికీ మంచి జరిగే విధంగా గ్రామాలలో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలకు సంబంధించి నిర్వాహకులు అందరికీ మరియు మున్సిపాలిటీ పరిధిలోని ఉత్సవ నిర్వాహకులు అందరికీ ఆయన ఇన్స్ట్రక్షన్స్ ఇచ్చారు. మట్టి వినాయకులు పెట్టాలని డీజేలు పెట్టొద్దని చిన్న చిన్న గొడవలు జరిగే తావు ఇవ్వదని చెప్పారు ఈ కార్యక్రమం వికారాబాద్ రోడ్డు ఇబ్రహీంపల్లి సమీపంలో అట్లాస్ ఫంక్షన్ హాల్ ఎందు జరిగింది.



## కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ పోరుబాట

- **బకాయిలు వెంటనే చెల్లించాలి.**
- **మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత.**

**బూర్గంపాడు, సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం)**



కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల పాలనపై నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'పోరుబాట' కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలోని జెడ్పీటీసీ క్యాంప్ కార్యాలయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, వృద్ధులు, బీడీ కార్మికులకు నెలకు రూ.4 వేల పెన్షన్, దివ్యాంగులకు నెలకు రూ.6 వేల పెన్షన్ వంటి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అలాగే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద ఆడబిడ్డల వివాహాలకు తులం బంగారం అందించే హామీ, విద్యార్థినులకు స్కూటీలు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలు కూడా నెరవేర్చాల్సి ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు భారీగా పేరుకుపోయాయని, దీంతో కళాశాల విద్యార్థులు, విద్యాసంస్థలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేయాలని, ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, దివ్యాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, మాజీ టౌన్ అధ్యక్షులు, టౌన్ నాయకులు, మాజీ యూత్ అధ్యక్షులు, యూత్ నాయకులు, మండల మహిళా నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి ది ప్రజా ప్రభుత్వం కెసిఆర్ ది కుటుంబ ప్రభుత్వం.

- **మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని 8 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టేసిన పాపం కేసీఆర్ ది.**
- **రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం లక్ష్యం.**
- **కాంగ్రెస్ పార్టీ పోతంగల్ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్.**
- **కాంగ్రెస్ వెయ్యి రోజుల పరిపాలనపై పోతంగల్ లో అవగాహన కార్యక్రమం.**

**పోతంగల్, సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**



నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుప్పాల శంకర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పరిపాలనలో జరిగిన అభివృద్ధి సంక్షేమం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్ మాట్లాడుతూ.... రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని లక్ష్యంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం యొక్క ప్రజాపాలన కొనసాగుతుందని చెప్పారు. అందుకే గృహజ్యోతి పథకం కింద ప్రతి ఇంటికీ ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, అర్హులైన ప్రతి కుటుంబానికి తెల్ల రేషన్ కార్డుల జారీ, మహిళల పేరుతో ఇందిరమ్మ ఇండ్లు,బతుకమ్మ చీరలు, మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందజేస్తుందని గుర్తు చేశారు. హైదరాబాద్ లో హైడ్రా ఏర్పాటుచేసి వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను రక్షించిందని. రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం ఎకకాలంలో 2లక్షల రుణమాఫీ చేసి, సన్నాలకు బోనస్ క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుందని చెప్పారు. రైతు భరోసా 9రోజుల్లో 9వేల కోట్లు రైతుల ఖాతాలో వేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిదని అన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని కెసిఆర్ కు తెలంగాణ ప్రజలు అప్పజెబితే పదేళ్ల పరిపాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని ఎనిమిది లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టేశారని విమర్శించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకంలో కాంట్రాక్టర్లకు లింకు పెట్టి కోట్ల రూపాయలు కాంట్రాక్టర్ల జేబులు నింపారని కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు నేరుగా లబ్ధిదారుల ఎకౌంట్లో పడుతున్నాయని చెప్పారు. రుణమాఫీ లోను లక్ష రూపాయల రుణాన్ని నాలుగు విడతల్లో మాఫీ అని రైతులను కేసీఆర్ నానా ఇబ్బందులు పెట్టారని గుర్తు చేశారు. గుట్టలకు, ఖాళీ స్థలాలకు, రైతు బంధు ఇచ్చి పేద ప్రజలకు చెందాల్సిన వేలకోట్ల రూపాయలు బడా బాబుల జేబుల్లో నింపారని కెసిఆర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ చేసిన అప్పుల యొక్క వడ్డీని నెలకు దాదాపు ఆరున్నర వేల కోట్లు ప్రభుత్వం చెల్లిస్తుందని లేదంటే ఇచ్చిన హామీలన్నీ అమలు అయ్యేవని అన్నారు. బాన్సువాడ లో ముందు చూపు ఉన్న నాయకుడు పోచారం ఎమ్మెల్యేగా ఉండటం వల్ల నిజాంసాగర్ కాల్వలకు సీసీ చేయించి చివరి ఆయకట్టుకు నీరందేలా చేశారని అన్నారు. రాష్ట్రంలో 72 ప్రాజెక్ట్ లు ఉండగా అందులో రైతుల సంక్షేమం కోసం పోచారం శ్రీనివాసరెడ్డి కృషితో మొట్టమొదటగా నిజాంసాగర్ నుంచి మాత్రమే రైతుల కోసం సాగు నీరు వదిలినట్లు చెప్పారు. రేవంత్ రెడ్డి పరిపాలనలో కింది స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు అందరూ ఉద్యోగులకు ఒకటవ తారీఖున జీతాలు పడుతున్నాయని దీంతో ఉద్యోగులందరూ సంతోషంతో రేవంత్ రెడ్డి పరిపాలన పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.ప్రజలందరూ రేవంత్ రెడ్డి ప్రజా పరిపాలన విధానాన్ని గమనిస్తున్నారని రేవంత్ రెడ్డి పరిపాలనలో ప్రజలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు నేరుగా అందుతున్నాయని గుర్తు చేశారు. ప్రతిపక్ష పార్టీలు చెప్పే మాయ మాటలను ప్రజలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో...పోతంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూప్పాల శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు, జల్లాపల్లి సర్పంచ్ వివేక్, హెగ్డోలి గ్రామ సర్పంచ్ నాగరాజు ,మాజీ ఎంపీపీ గంధపు పవన్ కుమార్,మాజీ ఎంపిటిసి కేశ వీరేశం,మాజీ సర్పంచ్ వర్ని శంకర్,మాజీ ఏ ఎం సీ చైర్మన్ నీరెడి గంగాధర్,సీనియర్ నాయకులు ఎజాస్ ఖాన్ , మండవ దిలీప్ కుమార్, నాయకులు పుల్కంటి సాయిలు, గంట్ల విఠల్, మాణికప్ప, గంగులు ,మాజీ ఎంపిటిసి రాములు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు పుప్పాల అభిషేక్, గంధపు రాజు, గంధపు దత్తు, ధనరాజ్, మన్సూర్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాంద్ పాషా, శివరాజ్ పటేల్, కొత్తపల్లి సుదర్శన్, సంధాని, మల్లుగొండ, హొగిరి రావు దేశాయ్, రాజేందర్, సురారెడ్డి, సాయినాథ్, దొడ్డిమీది రాంబాబు, సజ్జద్,మైమూద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- **మాజీ ఎమ్మెల్యే జి. విఠల్‌రెడ్డి**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా కుబీర్ మండల కేంద్రంలో ప్రజా పాలన వారోత్సవాలను మాజీ ఎమ్మెల్యే జి. విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యమిస్తూ ప్రజా పాలన సాగిస్తోందన్నారు.

వెయ్యి రోజుల పాలనలో పేదలు రైతులు, మహిళలు, విద్యార్థులు బలహీనవర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా 53 లక్షలకు పైగా కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి, సుమారు రూ.12,161 కోట్ల మేర ప్రయాణ చార్జీల భారం తగ్గించినట్లు పేర్కొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని, రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా పెట్టుబడి సాయం అందించినట్లు విఠల్‌రెడ్డి వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం తొలి విడతలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టి, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.38 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, 15.46 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు చెప్పారు. 22 లక్షలకు పైగా విద్యార్థులకు అల్పాహారం,పాలు, పోషకాహారం అందించేందుకు రూ.720 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టిందని, పోలీసు శాఖలో 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు వివరించారు.

**ఇళ్ల విషయంలో బీజేపీ తప్పుడు ప్రచారం**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం కూడా నిధులు అందిస్తోందంటూ బీజేపీ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని విఠల్‌రెడ్డి ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా పేదలకు ఇళ్లు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో సుమారు రూ.200 కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.

**పేదల పథకాలను అడ్డుకోవద్దు**

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల విషయంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రాజకీయాలు చేస్తున్నారని విఠల్‌రెడ్డి విమర్శించారు. పేద, బడుగు, బలహీనవర్గాల కుటుంబాలకు ఈ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. పథకాలను అడ్డుకునే ప్రయత్నాలు జరిగినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తరఫు న్యాయవాదులతో మాట్లాడి పేదల ప్రయోజనాలను కోర్టుకు వివరించి స్టే తొలగేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూడా అధిక ప్రాధాన్యం ఇస్తోందని విఠల్‌రెడ్డి అన్నారు. ప్రజల ఆశీస్సులతో ప్రభుత్వం మరింత సమర్థవంతంగా పనిచేస్తూ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు

## మన ఆగ్రో ఎరువుల దుకాణం నిర్వాకం.

- **నకిలీ మందులతో నాలుగు ఎకరాలు ధ్వంసం...?**
- **అడ్డాకులలో ఆలస్యంగా వెలుగు చూసిన వైనం...**
- **అధికారులకు ఫిర్యాదు చేసిన రైతు ఆదిత్య రెడ్డి**
- **నష్టపరిహారం చెల్లించాలంటున్న రైతు.**
- **మన ఆగ్రో ఎరువుల దుకాణం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్.**

**అడ్డాకుల సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**







అడ్డాకుల మండల కేంద్రంలో మన ఆగ్రో ఎరువుల దుకాణం ఇచ్చిన మందులు వాడే నాలుగు ఎకరాల పంట ధ్వంసమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గత పది రోజుల క్రిందట అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన ఆదిత్యా రెడ్డి తన సొంతమైన నాలుగు ఎకరాల పొలంలో వరిని నాటారు. పంట పెరగడానికి అడ్డాకుల మండల కేంద్రంలో ఉన్న మన ఆగ్రో కంపెనీకి సంబంధించిన దుకాణంలో ఏ మందులు వాడాలని సలహా కోరగా హుమిక్ యాసిడ్ 51%, సర్వోఫిక్స్ మందులు వాడమని సలహా ఇస్తూ తన షాపులోని మందులను ఇవ్వడం జరిగింది. ఆదిత్య రెడ్డి వార్డు తీసుకుని వెళ్లి తన పొలంలో వేశారు. రెండు రోజుల తర్వాత నాలుగు ఎకరాలలో ఉన్న వరి పంట పూర్తిగా ధ్వంసం అయింది. మళ్లీ షాపు యజమానిని సంప్రదించగా జింక్ సల్ఫేట్ మందులను పిచికారి చేయమని ఇవ్వడం జరిగింది. జింక్ సల్ఫేట్ మందులు పిచికారి చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేదు. నాలుగు ఎకరాలలో ఉన్న వరి పంట పూర్తిగా చనిపోవడం జరిగిందని రైతు ఆదిత్యా రెడ్డి తెలిపారు. ఈ విషయం గురించి అడ్డాకుల మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయగా జిల్లా కేంద్రంలోని వ్యవసాయ ఏడి, మరియు వ్యవసాయ అధికారి ఇద్దరు వరి పంటను పరిశీలించి వాటి నమూనాలను ల్యాబ్ కు పంపించడం జరిగిందని రైతు తెలిపారు. ఇటీవల అడ్డాకుల మండల కేంద్రానికి ఉచిత న్యాయ సలహా పై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఇందిర రావడంతో నష్టపోయిన బాధ్యత రైతు నకిలీ మందులు అమ్మిన దుకాణంపై చర్యలు తీసుకుని తనకు నష్ట పరిహారం ఇప్పించాలని జడ్జికి విన్నవించడం జరిగింది. అక్కడే ఉన్న వ్యవసాయ అధికారిని వివరణ కోరగా శాంపిల్స్ ల్యాబ్ కు పంపించామని శాంపిల్స్ వచ్చిన తర్వాత మన ఆగ్రో దుకాణం పై చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి తెలపడం జరిగింది. నకిలీ మందులన్నీ నాలుగు ఎకరాలలో ఉన్న తన వరి పంటను పూర్తిగా చనిపోయేలా చేసిన మన ఆగ్రో కంపెనీ దుకాణంపై చర్యలు తీసుకుని తనకు నష్టపరిహారం అందించాలని బాదిత రైతు ఆదిత్యా రెడ్డి కోరారు.

# 40 మంది నుంచి 136కు..

- **చెంచువాడ బడి ప్రగతిపథంలో**
- **ఉపాధ్యాయుడు చిన్న రాములు కృషికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు**

**వనపర్తి, సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**

ఒకప్పుడు దట్టమైన పొదలు, కంపచెట్లు, మట్టి దిబ్బలతో అధ్వానంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల.. నేడు 136 మంది విద్యార్థులతో కళకళలాడుతోంది. పెబ్బేరు మండలం చెంచువాడలోని ఎంపీపీఎస్ పాఠశాల రూపురేఖలు మారడంలో ఎస్జీటీ ఉపాధ్యాయుడు డి. చిన్న రాములు చేసిన కృషి కీలకంగా నిలిచింది. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం 2026 సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది.

**బదిలీపై వచ్చి.. అభివృద్ధికి శ్రీకారం**

2024 జూలై 1న చెంచువాడ పాఠశాలకు బదిలీపై వచ్చిన చిన్న రాములు.. అప్పట్లో పాఠశాలలో ఉన్న పరిస్థితులను చూసి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో పాఠశాలలో కేవలం 40 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. పాఠశాల ప్రాంగణం మొత్తం దట్టమైన పొదలు, కంపచెట్లు, మట్టి దిబ్బలతో నిండి ఉండేది.

ప్రాంగణం శుభ్రం.. ఆటస్థలం సిద్ధం స్థానిక నాయకులు, ప్రజల సహకారంతో పాఠశాల ఆవరణలోని పొదలు, కంపచెట్లను తొలగించి ప్రాంగణాన్ని పూర్తిగా శుభ్రం చేయించారు. మట్టి దిబ్బలను తొలగించి గ్రౌండ్‌ను చదును చేయించారు. దీంతో విద్యార్థులకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణం ఏర్పడింది. విద్యార్థుల సంఖ్యలో గణనీయమైన పెరుగుదల పాఠశాలలో విద్యా వాతావరణాన్ని మెరుగుపరచడంతో పాటు చేపట్టిన వినూత్న కార్యక్రమాలు సత్ఫలితాలనిచ్చాయి.

2024-25: 40 మంది విద్యార్థులు
2025-26: 96 మంది విద్యార్థులు
2026-27: 136 మంది విద్యార్థులు

రెండేళ్ల వ్యవధిలో విద్యార్థుల సంఖ్య 40 నుంచి 136కు చేరడం పాఠశాలపై తల్లిదండ్రులు, స్థానికుల్లో పెరిగిన నమ్మకానికి నిదర్శనంగా నిలిచింది.

**తరగతి గదుల కొరతను అధిగమించి..**

విద్యార్థుల సంఖ్య పెరగడంతో పాఠశాలలో తరగతి గదుల కొరత ఏర్పడింది. పాఠశాలలో కేవలం రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నప్పటికీ.. విద్యాబోధనకు ఇబ్బంది కలగకుండా చిన్న రాములు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. సొంత ఖర్చులతో పాటు దాతల సహకారం తీసుకుని రేకుల షెడ్డు ఏర్పాటు చేసి అదనపు తరగతులను నిర్వహించేలా చర్యలు చేపట్టారు. అవార్డుతో గుర్తింపు



పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సంఖ్య పెంపు, మౌలిక వసతుల కల్పనకు చేసిన కృషికి గుర్తింపుగా డి. చిన్న రాములు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన సేవలను సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చిన్న రాములు వంటి ఉపాధ్యాయుల కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రభుత్వ బడుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని శంకర్ గౌడు పిలుపునిచ్చారు.

## బాలకృష్ణుడి వేషంలో ముద్దులొలికించిన మయాంక్

**తాండూర్ సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**



శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా చిన్నారులను బాలకృష్ణుడి వేషధారణలో అలంకరించే వేడుకల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కరణం పురుషోత్తం రావు మనవడు కరణం మయాంక్ బాలకృష్ణుడి అవతారంలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నాడు. నెమలి పింఛం, చేతిలో వేణువుతో సంప్రదాయ వస్త్రధారణలో మయాంక్ ముద్దుగా కనిపిస్తూ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. చిన్నారి కృష్ణుడి రూపాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆశీర్వదించారు. దీంతో మయాంక్ కృష్ణావతారం కుటుంబంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలకు మధుర జ్ఞాపకంగా నిలిచింది.



## చెట్టునడుగు.. పుట్టనడుగు' కాదు.. ప్రజలనడుగు

- **దమ్ముంటే ప్రజాక్షేత్రంలోకి రా..**
- **అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?**
- **మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ స్ట్రాంగ్ కౌంటర్**

**భువనగిరి సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం)**

చెట్టునడుగు పుట్టనడుగు.. సీసీ రోడ్డునడుగు.. కరెంట్ పోలునడుగు" అంటూ మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాత్రి డైలాగులు రాసుకుని.. పొద్దున్నే సినిమా డైలాగులు కొడితే ప్రజలు నమ్మరని, అభివృద్ధి చేసింది ఎవరో ప్రజలే చెబుతారని అన్నారు. పైళ్ల శేఖర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కాకముందే అర్బన్ కాలనీలో కాంగ్రెస్ నాయకత్వంలో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుచేస్తూ.. ఇతరులు చేసిన పనులకు కూడా తమ పేర్లు తగిలించుకుని ప్రచారం చేసుకోవడం సరికాదని విమర్శించారు. ఫ్లెక్సీలపై ఫొటోలు వేసుకున్నంత మాత్రాన చరిత్ర మారదని, అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు, తేదీలు, ఆధారాలను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. మాటల యుద్ధం కాదు వాస్తవాల యుద్ధం చేద్దాం. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి నువ్వు చెప్పిన అర్బన్ కాలనీలోనే నీల ట్యాంకును అడుగు అర్బన్ హెల్త్ సెంటర్ను అడుగు, స్ట్రామ్ వాటర్ డ్రైన్లు అని, అడుగు, సిసి రోడ్లను అడుగు, ఇప్పుడు ప్రతి వార్డులో ఇల్లు లేని ఖాళీ స్థలం ఉండి ఇంది రమ్మ ఇల్లు కట్టుకుంటా వాళ్ళని అడుగు, రేషన్ కార్డు లేక రేషన్ కార్డులో పేరు ఎంట్రీ కాక పది సంవత్సరాల నుంచి నిరీక్షించి కొత్త రేషన్ కార్డులు మంజూరైన వాళ్ళని అడుగు, దొడ్డు బియ్యం నుండి సన్న బియ్యం తింటున్న పేద వాళ్ళని అడుగు ఆ తర్వాత బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిపై ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ పైళ్ల శేఖర్‌రెడ్డికి బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ సవాల్ విసిరారు. చెట్టునడుగు పుట్టనడుగు అని కాదు.. భువనగిరి ప్రజలనడుగు. ఎవరి హయాంలో ఏ పని జరిగిందో ప్రజలే చెబుతారు. దమ్ముంటే సినిమా డైలాగులు పక్కనపెట్టి ప్రజాక్షేత్రంలోకి రా డేటాతో మాట్లాడి అభివృద్ధి లెక్కలు తేల్చుకుందాం అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ చీస్తీ, పోత్నక్ ప్రమోద్ కుమార్, తంగళ్లపల్లి రవికుమార్, ఎండి మజార్, జాలిగం విగ్నేష్, ఎండి లైక్ అహ్మద్, పోలిశెట్టి అనిల్ కుమార్, మహ్మద్ బబ్లు, వెల్లంల జంగయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కురివి కృష్ణా స్వామి ముదిరాజు 133 వ జయంతి వేడుకలు

**భువనగిరి సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం)**

ఘనంగా కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 133వ జయంతి వేడుకలు భువనగిరి హైదరాబాద్ తొలి మేయర్, ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 133వ జయంతి వేడుకలను భువనగిరి పట్టణము లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సభ జిల్లా అధ్యక్షులు, కుక్కదూగ సోమయ్య, కొలుపుల వివేకానంద, దిడ్డికాడి వేంకటేశ్‌లు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, హైదరాబాద్ మాజీ మేయర్ రచయిత, పాత్రికేయుడు, ముదిరాజ్ వ్యవస్థాపక అధ్యక్షులు కురివి కృష్ణా ముదిరాజ్ లతో పాటు బహుజనుల అభివృద్ధికి ఆయన జీవితాన్ని అంకితం చేశారన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించి చెరగని ముద్ర వేశారని కొనియాడారు. బహుజనులందరూ ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు తుపాకుల శ్రీనివాస్, గోర్రెం కల శ్రీనివాస్, గంటేపాక జంగయ్య, జంగిటి రవీందర్, కుశంగల నరసింహ, అందే నరసింహ, అందే విజయ్, బరిగే శంకర్ పాల్గొన్నారు.



## కళాకారులను ప్రోత్సహించడం మనందరి బాధ్యత

- **గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీయాలి**
- **తెలంగాణ జానపద కళలను కాపాడుకోవాలి**
- **పలుస శంకర్‌గౌడ్**

**పెబ్బేరు, సెప్టెంబరు 04(ప్రజాక్షేత్రం):**



కళాకారులు సమాజానికి, సంస్కృతికి ప్రతిబింబాలుగా నిలుస్తారని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న గాయకులు, కళాకారుల ప్రతిభను వెలికితీసి వారికి తగిన ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు.శుక్రవారం పెబ్బేరు పట్టణంలో ఏర్పాటు చేసిన వీఎంసీ రికార్డింగ్ స్టూడియోను ఆయన సందర్శించారు. ఔత్సాహిక గాయకులు, కళాకారులకు వేదిక కల్పిస్తూ వారిని ప్రోత్సహిస్తున్న స్టూడియో నిర్వాహకుడు యెల్లారెడ్డిని అభినందించారు. అనంతరం యెల్లారెడ్డిని శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలుస శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభావంతులైన గాయకులు, కళాకారులు ఉన్నప్పటికీ సరైన వేదిక, అవకాశాలు లేక వెలుగులోకి రావడం లేదన్నారు. స్థానికంగానే రికార్డింగ్ సదుపాయాలు అందుబాటులోకి రావడం ద్వారా యువతలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు జానపద కళలు ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తున్నాయని అన్నారు. జానపద గీతాలు, కళారూపాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కళాకారులను ప్రోత్సహించడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించగలమన్నారు. కార్యక్రమంలో పృథ్వీరాజ్, వెంకటస్వామి, షఫీ, చంద్రయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ఇది ప్రజా ప్రభుత్వం కాదు "దగా ప్రభుత్వం"

- **శంకర్ పల్లి మండల బీఆర్ఎస్ నేతల విమర్శలు.**
- **కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనపై నిరసన 3 వ రోజు ఇంద్రారెడ్డి**
- **ప్రధాన చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున మహిళలతో వంట వార్పు కార్యక్రమం.**

**శంకర్ పల్లి సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**

శంకర్ పల్లి మండల కేంద్రంలోని ఇంద్రారెడ్డి ప్రధాన చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున మహిళలతో కలిసి శంకర్ పల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి మరియు మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు (సొసైటీ చైర్మన్) బద్దం శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల విఫల పాలనపై పెద్ద ఎత్తున ధర్నా చేశారు. అనంతరం ఇంద్రారెడ్డి ప్రధాన చౌరస్తా వద్ద వంట వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శంకర్ పల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గండిచర్ల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ...గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 200 పింఛను నుండి 2000 రూపాలకు పెంచిన ఘనత బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ దే అని గుర్తు చేశారు. ఇప్పుడున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2000 రూ. పింఛన్ 4000 కి పెంచుతామని అబద్ధపు అమలు కానీ హామీలు ఇవ్వడం సిగ్గు చేటు అని ఆయన ఎద్దేవ చేశారు. బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు (సొసైటీ చైర్మన్) బద్దం శశిధర్ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యంగా మహిళలు, వికలాంగుల సమస్యలను అజెండాగా చేసుకుని హామీల అమలుపై నిలదీసారు.ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, ముఖ్యంగా మహిళలకు నెలకు ₹2,500 ఇచ్చే మహాలక్ష్మి పథకం, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, విద్యార్థినులకు ఉచిత స్కూటర్లు మరియు ₹500 లకే వంట గ్యాస్ సిలిండర్ వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిందని, కేసీఆర్ కిట్లను నిలిపివేయడం, బతుకమ్మ చీరల పంపిణీ ఆపేయడం ద్వారా చేనేత కార్మికుల పొట్ట గొట్టారని, ఇది ప్రజా ప్రభుత్వం కాదు, "దగా ప్రభుత్వం" అని విమర్శించారు. మాజీ ఎంపీపీ ధర్మాన్నగారి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వంద రోజుల స్వర్గం వెయ్యి రోజుల నరకం"ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలను 100 రోజుల్లోనే అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. వెయ్యి రోజులు దాటినా ఒక్క ప్రధాన హామీని కూడా పూర్తిగా నెరవేర్చలేదని మండిపడ్డారు. వంద రోజుల్లో స్వర్గం చూపిస్తామని చెప్పి, వెయ్యి రోజులుగా ప్రజలకు నరకం చూపించారు అని ఆయన ధ్వజం ఎత్తారు నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు విషయం లో మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ నెరవేరలేదని, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. అభివృద్ధి శూన్యం, అప్పుల భారం వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ. 4.5 లక్షల కోట్ల అప్పులు చేసిందని, కానీ రాష్ట్రంలో ఎలాంటి కొత్త మౌలిక సదుపాయాలు లేదా ప్రాజెక్టులు నిర్మించలేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రిబ్బన్లు కట్ చేస్తూ కాలం గడుపుతోందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఎంతో కష్టపడి నిర్మించిన తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ చేతిలో పెడితే.. శాంతిభద్రతల క్షీణత, విద్యా వ్యవస్థ (గురుకులాలు) బలహీనపడటం, హైడ్రా పేరిట పేదల ఇళ్లను కూల్చడం వంటి చర్యలతో వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సింలు, బిఆర్ఎస్ సినియర్ నాయకులు వాసుదేవ్ కన్నా, మాజి మార్కెట్ కమిటి చేర్మేన్ మాణిక్ రేడ్డి, సర్పంచ్ లు రాఘవేందర్ రెడ్డి, ఇంద్రాసేనా రెడ్డి, మధోల్ల మల్లికార్జున్, ఎరుకల శేకర్, కౌన్సిలర్ లు విజయ్ కుమార్, మహేందర్ రెడ్డి, ప్రశాంత్, మాజి కౌన్సిలర్ లు శ్రీనాథ్, మాజీ సర్పంచ్ లు శ్రీధర్, నర్సింహా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బద్దం సురేందర్ రెడ్డి, అడ్వకేట్ ఉపేందర్ రెడ్డి, వేణు, బిఆర్ఎస్ పార్టి సినియర్ నాయకులు, యుత్ నాయకులు, మైనారిటీ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.





## ఎమ్మార్పీఎస్ పోరాటం ఫలితం విధుల్లోకి పరిశుద్ధ కార్మికుడు

- **తుర్క ఎనికేపల్లి సర్పంచ్ మంజుల వెంకటేష్ కి ఎమ్మార్పీఎస్ నాయకుల ధన్యవాదాలు.**

**పూడూరు సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**

గత నెలలో పూడూరు మండలం తుర్క ఎనికేపల్లి గ్రామంలో అదే గ్రామంలో పరిశుద్ధ కార్మికుడిగా పని చేస్తున్న మాల నర్సింలు ను కొన్ని కారణాల చేత గ్రామ కార్యదర్శి మరియు సర్పంచ్, మాల నర్సింలు ను వీధుల నుంచి తొలగించారు ఈ ఈ విధాన్ని మాల నర్సింలు ఎమ్మార్పీఎస్ పూడూరు మండల ఇంచార్జి గంజాయి యేసు మాదిగ కు మరియు జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్ మాదిగ, రవి కుమార్ మాదిగ, చిట్టి గిద్ద కిష్టయ్య కు విన్నవించుకున్నారు.
ఈ విషయం స్పందించిన మండల ఎమ్మార్పీఎస్ నాయకులు నరేష్ మాదిగ, సుధాకర్ మాదిగ, ప్రకాష్ మాదిగ, ఎం ఎస్ పి మండల అధ్యక్షుడు మల్లేష్ మాదిగ,లు తుర్క ఎనికే పల్లి గ్రామానికి వెళ్లి గ్రామాన్ని సందర్శించి విషయాలను తెలుసుకొని గ్రామ సర్పంచ్ మరియు కార్యదర్శి నీ కలిసి మాల నర్సింలు ను మళ్ళీ విధులకు తీసుకోవాలని
డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ మంజుల వెంకటేష్ కోరగా వారు స్పందించి మాల నర్సింలు ను విధులకు తీసుకున్నారు అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులు సర్పంచ్ కి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.



## గుండెపోటుతో మాజీ జెడ్పిటిసి కోట మల్లారెడ్డి మరణం.

**భువనగిరి సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండల మాజీ జెడ్పిటిసి కోట మల్లారెడ్డి గుండె పోట్టుతో మరణించడం జరిగింది శుక్రవారం వారి గ్రామానికి వెళ్లి వారి భౌతిక దేహంపై పూలమాల వేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకంట్ల జగదీశ్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కుబీర్ ఎల్లమ్మ చెరువులో వరుస విషాదాలు.

- **ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలనీ డిమాండ్.**

**నిర్మల్ ప్రతినిధి సెప్టెంబరు 04(ప్రజాక్షేత్రం):**



కుబీర్ కేంద్రంలోని ఎల్లమ్మ చెరువులో శుక్రవారం దేవిదాస్ అనే బాలుడు (16) మునిగి ప్రాణాలు కోల్పోవడం గ్రామంలో విషాదాన్ని నింపింది. గతంలో ఇదే చెరువులో ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన ఘటన మరువకముందే మరో బాలుడు బలైపోవడం స్థానికులను కలిచివేసింది. వరుసగా జరుగుతున్న ప్రమాదాలతో చెరువు పరిసర ప్రాంతాల ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఎల్లమ్మ చెరువు వద్దకు తరచూ చిన్నారులు, విద్యార్థులు, స్థానికులు వెళ్తుంటారని, ప్రమాదకర పరిస్థితులపై అవగాహన కల్పించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. చెరువు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గతంలో అధికారులు హామీ ఇచ్చినా ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువు లోతు, ప్రమాదకర ప్రాంతాలను సూచించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, విద్యార్థులు చెరువు వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు గ్రామ పెద్దలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. మరోసారి ఇలాంటి విషాద ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## "జయకృష్ణ ముకుందా మురారి" అంటూ భక్తి పారవశ్యంలో స్వామి వివేకానంద పాఠశాల

- **స్వామి వివేకానంద పాఠశాలలో నేత్రపర్వంగా కృష్ణాష్టమి వేడుకలు**
- **కృష్ణుడి వేషధారణలో అలరించిన చిన్నారులు.. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**

**పెద్దేముల్, సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**

శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దేముల్ మండల కేంద్రంలోని స్వామి వివేకానంద పాఠశాలలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. విద్యార్థులు శ్రీకృష్ణుడు,రాధ, గోపికల వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు.హిందూ సాంప్రదాయం ప్రకారం శ్రావణ మాసం కృష్ణపక్షం అష్టమి తిథి,రోహిణి నక్షత్రంలో అర్ధరాత్రి సమయంలో దేవకీ, వసుదేవులకు శ్రీకృష్ణుడు జన్మించినట్లు పురాణాలు చెబుతున్నాయి. శ్రీకృష్ణుని జన్మదినాన్ని కృష్ణాష్టమి, గోకులాష్టమి పేర్లతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.ఈ పర్వదినం సందర్భంగా చిన్నారులు కృష్ణుడు, రాధ వేషధారణలో సందడి చేయడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, శ్రీకృష్ణుడి జీవిత విశేషాలను ప్రతిబింబించే ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల చక్కటి ప్రదర్శనలను చూసి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పి.జయంతి మాట్లాడుతూ....శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు,ఆధ్యాత్మిక విలువలపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. చిన్నారులు శ్రీకృష్ణుడు,రాధ వేషధారణలో పాల్గొనడం, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడి ఆదర్శాలను విద్యార్థులు జీవితంలో ఆచరిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ కె.కరుణాకర్ రెడ్డి,ఉపాధ్యాయులు ద్యావరి అశోక్, సునీత, నిర్మల, కల్పన, నరేష్ రెడ్డి, అంజలి, పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.







## అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**కొత్తగూడా సెప్టెంబర్ 04( ప్రజాక్షేత్రం):**



అఖిల భారత రైతు కూలీ సంఘం ( ఏఐకేఎంఎస్ ) ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్ పిలుపునిచ్చారు.శుక్రవారం మండల కేంద్రం మహాసభల విజయవంతం కోసం అఖిల భారత రైతు కూలీ సంఘం,అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో కొత్తగూడ మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్ మాట్లాడుతూ రైతులు, కూలీల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తు, రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరి వ్యతిరేకంగా ఏఐకేఎంఎస్ నిరంతరం ఉద్యమాలు చేస్తున్నది తెలిపారు. మరింత ఉద్యమ భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు రాష్ట్ర మహాసభలు కీలక వేదికగా నిలుస్తాయని తెలిపారు. రైతు కూలీలు, కార్మికులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. రైతు కూలీల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం, ఏఐకేఎంఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు భూర్కా వెంకటయ్య, జిల్లా సహాయ కార్యదర్శి పుల్లన్న, నాయకులు బుర్కా బుచ్చి రాములు, పూర్ణ చందర్, సోమయ్య, జామ్లా, రాయుడు, దేవేందర్, శ్రీను రాజా తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణ శుక్రవారం వేడుకగా వెంకటేశ్వర స్వామివారి అభిషేక సేవ

- స్వామివారికి వస్త్ర సమర్పణ చేసిన మాజీ కౌన్సిలర్స్ ఉంగ్లం అలేఖ్య–తిరుమల్ దంపతులు

**వనపర్తి, సెప్టెంబరు 04(ప్రజాక్షేత్రం):**



శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని వల్లభ్‌నగర్‌లో కొలువైన శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేక సేవలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 33వ వార్డు మాజీ కౌన్సిలర్స్ ఉంగ్లం అలేఖ్య, తిరుమల్ దంపతులు శుక్రవారం స్వామివారి అభిషేక సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులు స్వామివారికి నూతన వస్త్రాలను సమర్పించి, ఆలయ ఆచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అభిషేక సేవ నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన అభిషేక కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామివారి అభిషేకాన్ని కన్నులారా వీక్షించిన దంపతులు భక్తిపారవశ్యంతో పులకించిపోయారు.

**స్వామివారి సేవతో జన్మ ధన్యం**

శ్రీవేంకటేశ్వర స్వామివారికి అభిషేక సేవలో పాల్గొని వస్త్రాలు సమర్పించే భాగ్యం కలగడం తమకు ఎంతో సంతోషాన్ని, ఆధ్యాత్మిక తృప్తిని కలిగించిందని ఉంగ్లం అలేఖ్య-తిరుమల్ దంపతులు తెలిపారు. స్వామివారి సన్నిధిలో సేవ చేసే అవకాశం లభించడం తమ జన్మ ధన్యమైన అనుభూతిగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

**సర్వులపై స్వామివారి కృప ఉండాలని ప్రార్థన**

తమ కుటుంబ సభ్యులందరిపై శ్రీవేంకటేశ్వర స్వామివారి కృప, ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని దంపతులు ప్రార్థించారు. అలాగే తమ 33వ వార్డు ప్రజలు, వనపర్తి పట్టణ ప్రజలు, స్నేహితులు, ఆత్మీయులు, బంధువులందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలు నిండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో భక్తుల రాకతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. 'గోవిందా... గోవిందా' నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

## నేడు వనపర్తికి రానున్న మంత్రి సీతక్క

- రూ.69 కోట్ల పంచాయతీరాజ్ రహదారుల పనులకు పైలాన్ ఆవిష్కరణ

**వనపర్తి, సెప్టెంబరు 04(ప్రజాక్షేత్రం):**



పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క నేడు వనపర్తిలో పర్యటించనున్నారు. హ్యామ్ పథకం కింద రూ.69 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పంచాయతీరాజ్ శాఖ రహదారుల పనులకు సంబంధించిన పైలాన్‌ను ఆమె ఆవిష్కరించనున్నారు. శాసన సభ్యులు తూడిమేగారెడ్డి అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం 2 గంటలకు వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. మంత్రి సీతక్కకు కొల్లాపూర్ నుంచి వనపర్తి వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలకనున్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా, గాంధీచౌక్ మీదుగా చిట్యాల రోడ్డులో ఏర్పాటు చేసిన పైలాన్ వద్దకు ర్యాలీగా చేరుకోనున్నారు. పైలాన్‌ను ఆవిష్కరించిన అనంతరం అక్కడి నుంచి రాజీవ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ఏర్పాటు చేసే సభలో పాల్గొంటారు.

**భారీగా తరలిరావాలని పిలుపు**

రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకావడంపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలను ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వనపర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం పిలుపు నిచ్చాయి. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, పీసీసీ సభ్యులు, మండల అధ్యక్షులు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక వర్గాల నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, అనుబంధ సంఘాల నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు హాజరుకావాలని కోరారు. ప్రముఖుల హాజరు కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శివసేనారెడ్డి తదితరులు పాల్గొననున్నారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం.
- ముధోల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాపెవార్ కిష్టయ్య.

**నిర్మల్ జిల్లా ప్రతినిధి(ప్రజాక్షేత్రం):**

ముధోల్ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని ముధోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిష్టయ్య అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. ముధోల్ మండల కేంద్రంలో నూతన కాంగ్రెస్ పార్టీ మండల కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కిష్టయ్య మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, రైతు భరోసా పథకం ద్వారా అర్హులైన రైతులకు ఆర్థిక సహాయం అందిస్తోందని కిష్టయ్య తెలిపారు. మహిళలకు ఆర్థిక భారం తగ్గించేందుకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని చెప్పారు.

అలాగే గృహజ్యోతి పథకం ద్వారా అర్హత కలిగిన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ ప్రభుత్వం పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ముధోల్ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేస్తుందని కిష్టయ్య తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా పనిచేస్తామని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో నూతన మండల కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పరిపాలన చేతగాకే కేసీఆర్‌పై బురదజల్లే ప్రయత్నం

- - మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- - కాంగ్రెస్ 1000 రోజుల విఫల పాలనపై చేవెళ్లలో భగ్గుమన్న బీఆర్ఎస్
- శంకర్ పల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హోరెత్తిన భారీ వంటా-వార్పు నిరసన
- మహిళలకు రూ. 82 వేలు, పెన్షన్ల రూపంలో రూ. 66 వేలు ప్రభుత్వం బాకీ పడింది
- ఓట్ల కోసం గ్రామాలకు వస్తే కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలని పిలుపు

**చేవెళ్ల, సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**



రాష్ట్రంలో పరిపాలన చేతగాకనే సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్‌పై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత విధానాలు, వెయ్యి రోజుల వైఫల్య పాలనకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి చౌరస్తా గుండం వద్ద మూడో రోజు భారీ వంటావార్పు నిరసన కార్యక్రమం మండల అధ్యక్షుడు పెద్దోళ్ళ ప్రభాకర్ , నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగా శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వృద్ధులు, వికలాంగులు, మహిళలు పెద్ద సంఖ్యలో రోడ్డుపైనే పొయ్యిలు పెట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ మహా నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సబితా ఇంద్రారెడ్డి హాజరై మాట్లాడారు.

ఎన్నికల సమయంలో అంతులేని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఆ తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. మహిళలకు వివిధ పథకాల కింద ప్రభుత్వం రూ. 82 వేలు బాకీ పడిందని, ఇకపై కాంగ్రెస్ నాయకులు గ్రామాలలోకి ఓట్లు అడగడానికి వస్తే ముందు ఆ బాకీ డబ్బులు చేతిలో పెట్టి మాట్లాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే, ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక పూర్తిగా ఎగనామం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పెన్షన్ల ఎగవేత – "బాకీ కార్డుల" పంపిణీ**

రూ. 4,000 పింఛను ఇస్తామని చెప్పి వృద్ధులు, వికలాంగులను దారుణంగా మోసం చేశారని సబితా ఇంద్రారెడ్డి దుయ్యబట్టారు. కనీసం పాత పింఛను రూ. 2,000 కూడా సరిగ్గా ఇవ్వకుండా నెలల తరబడి పెండింగ్ పెట్టారని, ఒక్కో పెన్షన్ల లబ్ధిదారుడికి ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 66,000 బాకీ పడిందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు ఎంతెంత బాకీ పడిందో వివరిస్తూ క్షేత్రస్థాయిలో "బాకీ కార్డులు" పంపిణీ చేస్తున్నామని స్పష్టం చేశారు. వికలాంగులకు రూ. 6,000 ఇస్తామన్న హామీతో పాటు, 18 ఏళ్లు నిండిన చదువుకునే ఆడపిల్లలకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తామన్న మాటనూ ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించిందని విమర్శించారు.

**చేతగాకనే కేసీఆర్‌పై విమర్శలు**

ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. పాలన చేతకాక, రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే ఎప్పుడు మైకు పట్టుకున్నా కేసీఆర్ గారిపై నిరాధార ఆరోపణలు చేస్తూ బురదజల్లుతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం చేతకాక కాలక్షేపం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి తీవ్రస్థాయిలో పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ ఇంచార్జి దేశమల్ల ఆంజనేయులు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణ రెడ్డి, రాష్ట్ర నాయకుడు విజయ ఆర్య క్షత్రియ, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల నాయకులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు పాల్గొన్నారు.

## వెయ్యి రోజుల్లో అభివృద్ధి పరుగులు..

- పదేళ్లలో చేయలేనివి చేసి చూపించాం!
- బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యం..
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధికి పెద్దపీట,
- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- మదనపురం–కొత్తకోటలో ఘనంగా కాంగ్రెస్ ప్రజాపాలన వెయ్యి రోజుల సంబరాలు.. భారీ బైక్ ర్యాలీ

**దేవరకద్ర సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**



కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గంలోని మదనపురం, కొత్తకోట మండలాల్లో కాంగ్రెస్ శ్రేణులు భారీ సంబరాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి పాల్గొని పార్టీ శ్రేణులు, ప్రజల్లో ఉత్సాహం నింపారు.

మదనపురం మండలం దుప్పల్లి గ్రామం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ కొత్తపల్లి, మదనపురం మీదుగా కొత్తకోట, కానాయపల్లి, సంకిరెడ్డిపల్లి, అమడబాకుల మీదుగా కొత్తకోటకు చేరుకుంది. అనంతరం మదనపురం, కొత్తకోటలో నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

**బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై ఎమ్మెల్యే విమర్శలు**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.

"బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని ఎన్నో అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో చేసి చూపించింది" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను అమలు చేయకుండా దగా చేసిందని విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని హామీ, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, దళితులకు మూడెకరాల భూమి, ముస్లింలు, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు వంటి హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని భారీ అప్పుల కుప్పగా మార్చి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆర్థిక భారం మోపిందని ఎమ్మెల్యే విమర్శించారు.

రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణకు అభివృద్ధి దిశ

పాలమూరు బిడ్డ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ, గత ప్రభుత్వంలో ఏర్పడిన ఆర్థిక సమస్యలను పరిష్కరిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు.

**దేవరకద్రలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవరకద్ర నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లతో పండుగ వాతావరణం నెలకొందని, త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను కూడా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

మదనపురం మండలంలో 319 ఇళ్లు, కొత్తకోట మండలంలో 514 ఇళ్లు, కొత్తకోట పట్టణంలో 146 ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని ఇళ్లు మంజూరు చేసిందో ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే ప్రశ్నించారు.

**200 యూనిట్ల ఉచిత విద్యుత్.. రూ.500కే గ్యాస్ సిలిండర్**

రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. దేవరకద్ర నియోజకవర్గంలో దాదాపు 48 వేల కుటుంబాలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కలుగుతోందన్నారు.

మదనపురం మండలంలో 4,394 కుటుంబాలకు, కొత్తకోట పట్టణం, మండల పరిధిలో 9,743 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

అలాగే కొత్తకోట పట్టణంలో 2,852 కుటుంబాలకు, మదనపురం మండలంలో 4,570 కుటుంబాలకు, కొత్తకోట మండలంలో 6,167 కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్లు తెలిపారు.

**కొత్త రేషన్ కార్డుల పంపిణీ**

కొత్తకోట మండలంలో 7,896, మదనపురం మండలంలో 2,399 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కొత్త రేషన్ కార్డులు అందించడంతో పాటు కార్డుదారుల కుటుంబాలకు సన్నబియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదేనని అన్నారు.

**రూ.6 కోట్లతో బ్రిడ్జి పనులు పూర్తి**

మదనపురం నుంచి ఆత్మకూరు వెళ్లే మార్గంలోని బ్రిడ్జి నిర్మాణ పనులను గత పాలకులు పదేళ్ల పాటు పట్టించుకోలేదని ఎమ్మెల్యే విమర్శించారు. గతంలో సగం నిర్మించి నిలిపివేసిన బ్రిడ్జి పనులను పూర్తి చేసేందుకు రూ.6 కోట్ల నిధులు తీసుకొచ్చి పనులు పూర్తి చేశామని తెలిపారు. త్వరలో సంబంధిత మంత్రి చేతుల మీదుగా బ్రిడ్జిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

అదేవిధంగా శంకరపేట-దంతనూర్ ప్రాంతాల ప్రజల రాకపోకల సమస్యను పరిష్కరించేందుకు రూ.కోటి నిధులతో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పూర్తి చేశామని, త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

**మూడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు రూ.5 కోట్లు**

మదనపురం మండలంలోని మూడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని ఎమ్మెల్యే ఆరోపించారు. లిఫ్టుల నిర్వహణకు అవసరమైన నిధులు కూడా గత ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు.

తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మూడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల మరమ్మతులకు రూ.5 కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు.

**దేవరకద్రలో 100 పడకల ఆసుపత్రి..**
**కొత్తకోటలో 30 పడకల ఆసుపత్రి**

దేవరకద్రలో 100 పడకల ఆసుపత్రి, కొత్తకోటలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం వైద్య రంగాన్ని పట్టించుకోలేదని విమర్శించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

**విద్యారంగానికి కొత్త ఊపిరి**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దేవరకద్ర నియోజకవర్గంలో కనీసం డిగ్రీ కళాశాల, చిన్నచింతకుంట మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయలేదని ఎమ్మెల్యే అన్నారు.

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో దేవరకద్రలో డిగ్రీ కళాశాల, చిన్న చింతకుంటలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేశామని తెలిపారు. విద్య, వైద్యం, సాగునీరు, రహదారులు, సంక్షేమం వంటి అన్ని రంగాలకు సమ ప్రాధాన్యత ఇస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు.

**ఆరు గ్యారంటీల అమలుపై ఎమ్మెల్యే ప్రస్తావన**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.21 వేల కోట్లతో 25 లక్షల మంది రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు.

"అభివృద్ధిని చూసి మాజీ ఎమ్మెల్యే ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారు"

బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో చేస్తుండటాన్ని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి జీర్ణించుకోలేక ఫ్రస్ట్రేషన్‌కు గురవుతున్నారని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రజలు గత పాలన, ప్రస్తుత పాలనను బేరీజు వేసుకుంటున్నారని అన్నారు. అందుకే ఎంపీ, గ్రామ పంచాయతీ, ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన సమాధానం చెప్పారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**"దేవరకద్ర అభివృద్ధే లక్ష్యం .. ప్రజా సంక్షేమమే ధ్యేయం"**

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని, దేవరకద్ర నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడం తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వెయ్యి రోజుల పాలన సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీ, సభలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు ప్రజాప్రతినిధులు యువకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలేది వెయ్యి రోజులు గడిచినా నెరవేరని వాగ్దానాలు

- వనపర్తిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వంటావార్పు
- పెన్షన్లు పెంచాలి..మహిళలకు రూ.2,500 ఇవ్వాలి

**వనపర్తి, సెప్టెంబరు 04(ప్రజాక్షేత్రం):**



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తి గాంధీచౌక్‌లో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు.

ృద్ధులు, దివ్యాంగుల పెన్షన్లు పెంచడంతో పాటు మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి, విద్యార్థినులకు స్కూటీలు తదితర హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, వాటిలో అనేక హామీలు ఇంకా అమలుకు నోచుకోలేదని ఆరోపించారు.

**'పేదలకు భరోసా కల్పించాం'**

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్‌గౌడ్, వనపర్తి మండల అధ్యక్షుడు కే. మాణిక్యం మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో లేకపోయినా వితంతువులు, హెచ్ఐవీ బాధితులకు ఆసరా పింఛన్లు అందించిందన్నారు. 2014 నవంబరు 14న కొత్తకోట మండలంలో ఆసరా పింఛన్లను ప్రారంభించినట్లు తెలిపారు. వృద్ధులు, పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే పింఛన్లను పెంచినట్లు పేర్కొన్నారు.

**హామీలను వెంటనే అమలు చేయాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పింఛన్లు పెంచుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, వెయ్యి రోజులు పూర్తయినా ఆ హామీ అమలు కాలేదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దళిత కారోబార్‌పై దాడి.. నిందితులను అరెస్ట్ చేయాలి

- **కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి**
- **బాధిత కుటుంబానికి పోలీసు రక్షణ కల్పించాలి**
- **కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య**

**పెద్దేముల్, సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం కొండాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ కారోబార్‌గా విధులు నిర్వహిస్తున్న దళిత సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్‌పై జరిగిన దాడి, కులం పేరుతో దూషించిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య అన్నారు. ఘటనకు బాధ్యులైన వారిని తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఉప్పలి మల్కయ్య మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో తన విధులను నిర్వహిస్తున్న శ్రీనివాస్‌పై భౌతిక దాడికి పాల్పడటంతో పాటు కులం పేరుతో అవమానకరంగా, అసభ్యకర పదజాలంతో దూషించినట్లు ఆరోపించారు. ఒక దళిత ఉద్యోగిపై జరిగిన ఈ ఘటనను కేవలం వ్యక్తిగత దాడిగా చూడకుండా, దళితుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశంగా పరిగణించాలని కోరారు.

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలి**

శ్రీనివాస్‌పై దాడి, కుల దూషణలకు పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీలో చట్టబద్ధమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్న ఉద్యోగిపై దాడి చేసిన ఘటనపై విచారణను వేగవంతం చేసి, నిందితులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలి**

దాడికి గురైన శ్రీనివాస్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు తగిన పోలీసు రక్షణ కల్పించాలని ఉప్పలి మల్కయ్య కోరారు. ఘటనపై డివిజన్, జిల్లా స్థాయి పోలీసు అధికారులు, సబ్ కలెక్టర్, కలెక్టర్ తక్షణమే స్పందించి బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.నిందితులను వెంటనే అరెస్ట్ చేయకపోతే కేవీపీఎస్‌తో పాటు దళిత, గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఉప్పలి మల్కయ్య హెచ్చరించారు. దళితులపై కుల వివక్ష, దాడులను అరికట్టేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# పెద్ద షాపూర్ ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడిగా సంపత్ మాదిగ

**శంషాబాద్ సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**



మండలంలోని పెద్ద షాపూర్ గ్రామ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నూతన అధ్యక్షుడిగా పోతగళ్ల సంపత్ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ సమక్షంలో నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యక్షుడిగా కొమ్మగళ్ల రాజేందర్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర మహేందర్ మాదిగ, అధికార ప్రతినిధిగా వడ్డేమోని ధోనీ వర్ధన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంపత్ మాదిగ మాట్లాడుతూ.. మాదిగల హక్కుల సాధన, సామాజిక న్యాయం, వర్గీకరణ కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. గ్రామస్థాయిలో సంఘాన్ని మరింత బలోపేతం చేసి మాదిగల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు మంగళరం రత్నం మాదిగ, మండల ఇన్‌ఛార్జి కొత్తూరు రమేష్ మాదిగ, జిల్లా నాయకుడు రాచమల చిట్టిబాబు మాదిగ, మున్సిపల్ అధ్యక్షుడు చిన్నగండు భాస్కర్ మాదిగ, సీనియర్ నాయకుడు పోతగల రాజు, మండల కన్వీనర్ ఎర్ర నిఖిల్ మాదిగతో పాటు బాలరాజు, భాగ్యమ్మ, కొమ్మగళ్ల మల్లేశ్, కత్తుల శ్రీధర్, పోతగల్ల జేమ్స్, ఎర్ర రఘు, ఎర్ర శివ, ఇజ్రాయెల్, భాను ప్రకాశ్, మనోజ్, శ్రీకాంత్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.





# బీసీ వ్యతిరేక పార్టీ కాంగ్రెస్

- **మేడ్చల్ జిల్లా పద్మశాలి సంఘం**

**మేడ్చల్, ప్రజాక్షేత్రం :**

కాంగ్రెస్ పార్టీ మరొకసారి బీసీ మరియు మహిళా వ్యతిరేక పార్టీ అని నిరూపించుకుందని మునీరాబాద్ మాజీ సర్పంచులు గణేష్ నేత చిట్టి మిల్ల మరియు రాగజ్యోతి నేత చిట్టిమిల్ల తెలిపారు. ఒక బీసీ మహిళా బిడ్డని అత్యంత దారుణంగా క్యాబినెట్ ర్యాంకు నుంచి బర్తరఫ్ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్యని వారు వాపోయారు. కూతురు ఏదో మాట్లాడిందని తల్లిని శిక్షించడం అత్యంత దారుణమైన చర్య అని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వంపై అనేక మాటలు మాట్లాడిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,కోమటిరెడ్డి వెంకటరెడ్డి,తూర్పు జయప్రకాశ్ రెడ్డి లపై ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోకుండా కేవలం కూతురేదో మాట్లాడిందని కొండా సురేఖని క్యాబినెట్ నుండి బర్తరఫ్ చేయడం సిగ్గుచేటని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అగ్రవర్ణాల పార్టీగా మారిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇక రోజులు దగ్గర పడ్డాయని వచ్చే ఎన్నికల్లో బీసీలు, మహిళలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. పద్మశాలీల ఆడబిడ్డను అవమానించిన మీ పార్టీకి పుట్టగతులు లేకుండా పోతుందని కాంగ్రెస్ పార్టీ ఓటమి కోసం పద్మశాలిలమంతా పనిచేస్తామని తెలిపారు...... ఈ కార్యక్రమంలో మునీరాబాద్ మాజీ ఉపసర్పంచ్ గుండ్రోల్ల నర్సింగరావు మునీరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు కైరం కొండ సత్యనారాయణ నేత, గుర్రం దేవేందర్ నేత , కైరం కొండ నరేందర్ నేత , గుర్రం జనార్ధన్ నేత , కైరం కొండ రవీందర్ నేత, చిట్టిమిల్ల అరుణ నేత,చిట్టిమిల్ల భవాని నేత తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రామారావు పటేల్ శ్రీకారం





- **కిస్టాపూర్‌లో గోదాముకు భూమిపూజ..**
- **నర్సింహనగర్ తండాలో ఇందిరమ్మ ఇంటి ప్రారంభం**
- **మరో ఇళ్లు, గోదాము నిర్మాణానికి భూమిపూజ**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**

లోకేశ్వరంరైతులు పేదల సంక్షేమంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టి దశలవారీగా పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. లోకేశ్వరం మండలంలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని పనులకు శ్రీకారం చుట్టారు.

**కిస్టాపూర్‌లో గోదాముకు భూమిపూజ**

కిస్టాపూర్ గ్రామంలో నిర్మించనున్న గోదాముకు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గోదాములు అందుబాటులోకి రావడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. రైతులు పండించిన ధాన్యం ఇతర వ్యవసాయ ఉత్పత్తులను భద్రంగా నిల్వ చేసుకునేందుకు గోదాములు ఉపయోగపడతాయని తెలిపారు. పంట చేతికి వచ్చిన వెంటనే మార్కెట్ పరిస్థితులతో సంబంధం లేకుండా తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి రైతులకు ఉండకూడదన్నారు. గోదాముల్లో పంటను నిల్వ చేసుకుని మార్కెట్‌లో ధరలు అనుకూలంగా ఉన్న సమయంలో విక్రయించుకునే అవకాశం రైతులకు లభిస్తుందని పేర్కొన్నారు. తద్వారా రైతులకు మెరుగైన ధర లభించడంతో పాటు పంట నిల్వకు సంబంధించిన ఇబ్బందులు తొలగుతాయని అన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.

**నర్సింహనగర్ తండాలో ఇందిరమ్మ ఇంటి ప్రారంభం**

అనంతరం నర్సింహనగర్ తండాలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి లబ్ధిదారుల కుటుంబ సభ్యులను అభినందించారు. పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అదే తండాలో కొత్తగా నిర్మించనున్న మరో ఇందిరమ్మ ఇంటికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, సొంతింటి కలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రత ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు.

# పదవి పోయినంక పొలం పనుల్లో బిజీబిజీగా మాజీ మంత్రి చిన్నారెడ్డి !

- **కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా, మృధుస్వభావిగా చిన్నారెడ్డికి పేరు**
- **హైకమాండ్ ఆదేశాలను తు.చ తప్పకుండా పాటించే నేత**
- **రాజకీయ జీవితంలో తొలిసారి చేదు అనుభవం**
- **చిన్నారెడ్డి అడుగులు ఎటువైపు?**

**వనపర్తి సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**

వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం జయన్న తిరుమలాపూర్□లో మాజీ మంత్రి చిన్నారెడ్డి పొలం పనుల్లో నిమగ్నమై కనిపించారు. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి తనను తొలగించడంపై మాజీ మంత్రి చిన్నారెడ్డి స్పందించారు. తనకు పదవి వ్యామోహం లేదని, చిన్నారెడ్డిగా తనకు ఉండే గుర్తింపు ఉందని ఆయన చెప్పారు. సస్పెన్షన్□పై ఇప్పుడేమీ స్పందించనని చిన్నారెడ్డి వ్యాఖ్యానించారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డికి ప్రభుత్వం ఉద్వాసన పలికిన సంగతి తెలిసిందే. ఆయనను ఆ పదవి నుంచి తొలగిస్తున్నట్లు సీఎంవో ప్రకటించింది. చిన్నారెడ్డి స్థానంలో గద్వాల విజయలక్ష్మిని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవిలో నియమించింది. వనపర్తి నియోజకవర్గంలోని గోపాల్‌పేట సభలో స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిపై, పార్టీ హైకమాండ్‌పై చిన్నారెడ్డి పలు ఆరోపణలు చేయడంతో ఆయనపై వేటు పడింది. వనపర్తి నియోజకవర్గాన్ని నాశనం చేస్తున్నారని చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అన్నీ చూస్తూ భరిస్తున్నానని.. లేకపోతే జీవన్ రెడ్డిలా ఎప్పుడో పార్టీ మారేవాడినంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేపాయి. అధిష్టానం తనకు టికెట్ ఇవ్వమని చెప్పినా.. రాష్ట్రంలో అడ్డుకున్నారని.. కాంగ్రెస్ పార్టీని స్వార్థంతో కూలగొట్టటానికి ప్రయత్నిస్తున్నారని ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి కారణమయ్యాయి. కొంత మంది డబ్బులకు ఆశపడి తనకు అన్యాయం చేస్తున్నారని.. అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందని చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర నాయకత్వంతో పాటు అధిష్టానం కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పరిణామాల క్రమంలోనే ఆయనను ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి తొలగిస్తున్నట్లు ప్రభుత్వం గురువారం ప్రకటించింది.



# కొత్తగూడ లో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలన విజయోత్సవ వేడుకలు

**కొత్తగూడ సెప్టెంబర్ 04(ప్రజాక్షేత్రం):**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో నేడు తెలంగాణ రాష్ట్ర మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు భూక్య ఉమా మురళి నాయక్ కొత్తగూడ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బానోత్ రూప్ సింగ్ నేతృత్వం లో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బానోత్ రూప్ సింగ్ వారు మాట్లాడుతూ.. గత పదేండ్ల దొరల రాజ్యాధికారం విముక్తి కల్పించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకు వచ్చి రాష్ట్ర ప్రజలందరికీ "స్వేచ్ఛ" హక్కు కల్పించిన రేవంత్ సర్కార్ .. ప్రజా ప్రభుత్వంలో నిరుపేదలకు ఉపయోగపడే ప్రజా సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారు ఆనాడు నిధులతో ఉన్న రాష్ట్రాన్ని కెసిఆర్ సర్కార్ అప్పుల వలయంలో నెట్టి స్వార్థంతో ప్రజలకు ఉపయోగపడని సంక్షేమ పథకాల పేరుతో జేబులో నిప్పుకున్నారు. మన ప్రజా ప్రభుత్వం వచ్చేనాటికి వేలకొట్ల రూపాయలు అప్పులలో ఉంది వాటికి వడ్డీలు కట్టుకుంటూ ప్రభుత్వాన్ని ప్రజల కోసం సురక్షిత ప్రజాపాలన చేసుకుంటూ వ్యవసాయరంగం, మహిళలకు రక్షణ ఉపాధి, విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యతవైన విద్య, ప్రతి కుటుంబానికి ఉపయోగపడే సంక్షేమ పథకాలను అందించిన ఘనత రేవంత్ సర్కార్, రైతులకు రుణమాఫీ, మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీ పెంపు, గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇల్లు, నిరుపేదలందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందజేసి ప్రతి మనిషికి ఆరు కిలోల సన్నబియ్యాన్ని అందించిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం! ఆనాడు వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్ తమ ఫామ్ హౌస్ లో వందల ఎకరాలు స్వార్ధంగా వరి వేసుకున్నారు. నేడు రేవంత్ సర్కార్ ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రతి క్వింటాకు 500 బోనస్ అందించారు. నిరుద్యోగులకు మాట ప్రకారం ఉద్యోగాలు అందించారు. ప్రతి గ్రామాలలో సీసీ రోడ్లు కల్వర్టులు ప్రధాన రహదారులు అభివృద్ధి పథకంలో దూసుకుపోతుంది వెయ్యి రోజుల ప్రజా పరిపాలనలో సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి నిస్వార్థంగా అందుతున్నాయి అందుకు నిదర్శనం గత ఎన్నికల్లో అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ విజయాలు కైవసం చేసుకోవడం ఇదే కదా ప్రజాపాలన వెయ్యి రోజుల సందర్భంగా నేడు కొత్తగూడ మండల కేంద్రంలో విజయోత్సవ వేడుకలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజల సమక్షంలో జరుపుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ చల్లా నారాయణ రెడ్డి, కొత్తగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరబోయిన మొగిలి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరనేని వెంకటేశ్వర్లు, కొత్తగూడ బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కర్ర జనార్దన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య మండల అధికార ప్రతినిధి ఇర్ప రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ నేతల వంటావార్పు

**(ప్రజాక్షేత్రం)మేడ్చల్:**

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలను నిరసిస్తూ మేడ్చల్ సర్కిల్ పరిధిలోని 298 డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. మాజీ కోఆప్షన్ మెంబర్ ఆకిటి నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి హాజరై బీఆర్ఎస్ శ్రేణులకు మద్దతు తెలిపారు. వంటలు వండి నిరసన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు అక్కడే వంటలు వండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందంటూ నాయకులు ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఎన్నికల సమయంలో ప్రకటించిన గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు.వంటావార్పు కార్యక్రమం ద్వారా ప్రభుత్వంపై తమ నిరసనను వినూత్నంగా తెలియజేస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్‌లో కూడా ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు.



సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్‌లో కూడా ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు.పాలన వైఫల్యాలను నిరసిస్తూ మేడ్చల్ సర్కిల్ పరిధిలోని 298 డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. మాజీ కోఆప్షన్ మెంబర్ ఆకిటి నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి హాజరై బీఆర్ఎస్ శ్రేణులకు మద్దతు తెలిపారు. వంటలు వండి నిరసన వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు అక్కడే వంటలు వండి ప్రభుత్వానికి వ్యతిరేకం గా నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందంటూ నాయకులు ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఎన్నికల సమయంలో ప్రకటించిన గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు.వంటావార్పు కార్యక్రమం ద్వారా ప్రభుత్వంపై తమ నిరసనను వినూత్నంగా తెలియజేస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్‌లో కూడా ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394